విలేకరులు కావలెను

తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలో విలేకరులుగా పనిచేయడానికి ఆహ్వానిస్తున్నాము. సామాజిక దృక్పదం, అవినీతి, అక్రమాలపై అక్షర గళాన్ని వినిపించే దమ్మున్న విలేకరులు 'అక్షర వెలుగు' తెలుగు దిన పత్రికలో పని చేయడానికి ఈ క్రింది మేయిల్ అడ్రస్‌కు వివరాలను పంపండి

Mail: aksharavelugudaily@gmail.com

8985893382

www.aksharavelugu.com

# అక్షర వెలుగు

జనం కోసం - మన అక్షరం

తెలుగు దిన పత్రిక

గురు వారం

26. 05. 2022

తెలంగాణ, ఆంధ్రప్రదేశ్

సంపుటి - 01, సంచిక-88

పేజీలు - 4 వెల రూ. 5

ఎడిటర్ :
గోసుకొండ పృధ్విరాజు

Published From Hyderabad Circulated by Hyderabad, Rangareddy, Nalgonda, Karimnagar, Warangal, Mahaboobnagar, Kammam, Medak

# హైదరాబాద్‌కు నేడు ప్రధాని మోడీ రాక



- ఐఎస్‌బి ద్విశతాబ్ది ఉత్సవాలకు హాజరు
- ప్రధాని పర్యటనకు దూరంగా సిఎం కెసిఆర్
- ప్రధాని పర్యటనతో నగరంలో ట్రాఫిక్ ఆంక్షలు
- పలు రూట్లలో ట్రాఫిక్ డైవర్షన్

**హైదరాబాద్, మే 25 (అక్షర వెలుగు):** ప్రధాని మోదీ గురువారం హైదరాబాద్‌లో పర్యటించనున్నారు. ప్రఖ్యాత ఐఎస్‌బి సంస్థ వార్షికోత్సవంలో పాల్గొంటారు. ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్ ద్విదశాబ్ది ఉత్సవాలు, స్నాతకోత్సవ కార్యక్రమాలకు ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. అయితే ఈ పర్యటనలో కెసిఆర్ పాల్గొనడం లేదు. ఇక్రిశాట్ ఉత్సవాల సందర్భంగా దూరంగా ఉన్నట్లే ఇప్పుడు ఐఎస్‌బి ఉత్సవాలకు కూడా కెసిఆర్ దూరంగా ఉండనున్నారు. ఇకపోతే ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ నగర పర్యటన సందర్భంగా గచ్చిబౌలిలో పోలీసులు ఆంక్షలు విధించారు. ఐఎస్‌బీకి 5 కిలోమీటర్ల పరిధిలో డ్రోన్లు, పారా గ్లైడర్స్, మినీ ఎయిర్‌క్రాఫ్ట్‌లపై నిషేధం విధించారు. ఏరియల్ వ్యూ కోసం లైవ్ టెలికాస్ట్‌పై పోలీసులు నిషేధించారు. అటు ఐఎస్‌బీ, హెచ్‌సీయూ పరిసరాల్లో పోలీసుల ఆంక్షలు కొనసాగనున్నాయి. గురువారం మధ్యాహ్నం ఒంటి నుంచి సాయంత్రం 5 గంటల వరకు బేగంపేట, ఐఎస్‌బీ, సెంట్రల్ యూనివర్సిటీలో ట్రాఫిక్ ఆంక్షలు కొనసాగుతాయి. గచ్చిబౌలి స్టేడియం నుంచి విప్రో జంక్షన్ వరకు ఉన్న ఐటీ, ఇతర కంపెనీలు తమ ఆఫీస్ టైమింగ్స్‌ను మార్చు కోవాలని సూచించారు. ఈ రూట్లలో వచ్చే వాహనదారులు ప్రత్యామ్నాయ మార్గాలు చూసుకోవాలని తెలిపారు. గచ్చిబౌలి నుంచి లింగంపల్లి వైపు వెళ్లే వాహనదారులు గచ్చిబౌలి జంక్షన్ వద్ద మలుపుతీసుకుని బొటానికల్ గార్డెన్, కొండాపూర్ ఏరియా

2వ

## ప్రధానికి స్వాగతం పలికే ఆనవాయితీని కాలరాసిన కెసిఆర్


➤బేగంపేటలో ప్రధానికి స్వాగత ఏర్పాట్లు పరిశీలించిన లక్ష్మణ్



**హైదరాబాద్, మే 25 (అక్షర వెలుగు):** ప్రధాని మోదీ వస్తున్నారనే సీఎం కేసీఆర్ రాష్ట్రం విడిచిపోతున్నారని బీజేపీ నేత లక్ష్మణ్ పేర్కొన్నారు. బేగంపేట ఎయిర్‌పోర్టులో ఏర్పాట్లను లక్ష్మణ్ బృందం పరిశీలించింది. కేసీఆర్ నిబంధనలు పాటించకుండా నియంతలా వ్యవహరిస్తున్నారన్నారు. కేసీఆర్ చర్యలను తెలంగాణ ప్రజలు అసహ్యించుకుంటు న్నారన్నారు. ఎయిర్ పోర్టులో పార్టీ తరపున ప్రధానికి సన్మాన కార్యక్రమం నిర్వహిస్తామని లక్ష్మణ్ పేర్కొన్నారు. ఎయిర్ పోర్టులో ప్రధాని మోదీ ప్రసంగించే అవకాశం లేదన్నారు. ప్రధానికి సీఎం స్వాగతం పలికే ఆనవాయితీని కేసీఆర్ కాల రాశారన్నారు. రాష్ట్ర రైతులను వదిలి..ఇతర రాష్ట్ర రైతులకు డబ్బులు

## కాంగ్రెస్ పార్టీకి ఊహించని బిగ్ షాక్

- ఎస్పీ నుంచి రాజ్యసభకు కపిల్ సిబల్ నామినేషన్
- కాంగ్రెస్ పార్టీకి 16ననే రాజీనామా చేశానని వెల్లడి



**న్యూఢిల్లీ, మే 25 (అక్షర వెలుగు):** కాంగ్రెస్‌కు మరో భారీ షాక్ తగిలింది. ఈ పార్టీ సీనియర్ నేత, కేంద్ర మాజీ మంత్రి ,సీనియర్ లాయర్ కపిల్ సిబల్ హస్తానికి చేయిచ్చి, సైకిల్ ఎక్కారు. దీంతో కాంగ్రెస్‌కు భారీ షాక్ తగిలినట్టయ్యింది. పార్టీ సీనియర్ నేత, గాంధీ కుటుంబానికి అత్యంత సన్నిహితుడు, పేరు మోసిన న్యాయవాది కపిల్ సిబల్ పార్టీకి హఠాత్తుగా రాజీనామా చేసేశారు. చేయడమే కాదు.. ఏమాత్రం ఆలస్యం చేయకుండా సమాజ్‌వాదీ పార్టీ మద్దతుతో యూపీ నుంచి రాజ్యసభ సభ్యునిగా నామినేషన్ కూడా దాఖలు చేసేశారు. అంతేగాకుండా సమాజ్ వాదీ పార్టీ నుంచి రాజ్యసభ అభ్యర్థిగా నామినేషన్ వేశారు. ఎస్పీ చీఫ్ అఖిలేశ్ యాదవ్ సమక్షంలో నామినేషన్ దాఖలు చేశారు. ఈ నెల 16 వ తేదీనే.. కాంగ్రెస్‌కు రాజీనామా చేసినట్లు కపిల్ సిబల్ తెలిపారు. నామినేషన్ సమయంలో కపిల్ సిబల్ వెంట ఎస్పీ నాయకులు రాంగోపాల్ యాదవ్, ఉత్తమ్ పటేల్ సహా పలువురు నేతలు ఉన్నారు. సమాజ్ వాదీ పార్టీ మరో ఇద్దరు రాజ్యసభ అభ్యర్థుల పేర్లను ఖరారు చేసింది. కపిల్ సిబల్‌తో పాటు జావేద్ అలీ, డింపుల్ యాదవ్‌ను రాజ్యసభకు నామినేట్ చేసింది. సమాజ్‌వాదీ మద్దతుతో కపిల్ సిబల్ రాజ్యసభకు నామినేషన్ దాఖలు చేశారని సమాజ్‌వాదీ అధ్యక్షుడు అఖిలేశ్ యాదవ్ ప్రకటించారు. మరో ఇద్దర్ని కూడా తాము రాజ్యసభకు నామినేట్ చేసామని ప్రకటించారు. కపిల్ సిబల్ పేరు మోసిన లాయర్. పార్లమెంట్‌లో ఆయన సమర్థవంతంగా సమస్యలను ప్రస్తావించగలరు. సమాజ్‌వాదీ తరపున, ఆయన తరపున సమస్యలను ప్రస్తావిస్తారని

## ఒడిషాలో టమోటా వైరస్ విజృంభణ

కొత్తగగా 26 కేసులు నమోదు

**భువనేశ్వర్, మే 25 (అక్షర వెలుగు):** రోజుకో వైరస్, రోజుకో కొత్త వ్యాధి ప్రపంచాన్ని కలవరం పెడుతోంది. మొన్నటివరకూ స్వైన్ ఫ్లూ, బర్డ్ ఫ్లూలాంటి వైపరీత్యాలతో తీవ్ర పరిణామాలను ఎదుర్కొన్న జనాన్ని మరో కొత్త వైరస్ వణికిస్తోంది. అదే టొమాటో వైరస్. దీని కారణంగా తాజాగా ఒడిశాలో 26 కేసులు నమోదయ్యాయి. ఈ వైరస్ వల్ల ఇప్పటికే కేరళలో 80 కేసులు నమోదు కాగా... చిన్న పిల్లల్లోనే అధికంగా వ్యాపిస్తున్నట్టు తెలుస్తోంది. పిల్లలతో పోలిస్తే పెద్దవారిలో రోగ నిరోధక శక్తి అధికంగా ఉండడం వల్లే ఈ వ్యాధి ఎక్కువగా పిల్లల్లో వస్తున్నట్టు పరిశోధనలు చెప్తున్నాయి. ఒడిశాలో 36 సాంపిల్స్ ను వైద్యులు పరీక్షించగా.. అందులో 26 మంది పిల్లలకు ఈ వ్యాధి సోకినట్లు ధ్రువీకరించారు. వారంతా క్షేమంగానే ఉన్నారనీ, భయపడాల్సిన అవసరమేమీ లేదని వైద్యులు వెల్లడించారు. ఇదిలా ఉండగా టొమాటో ఫ్లూ వచ్చిన పిల్లల్లో ఎక్కువగా జ్వరం, నోటిలో నొప్పులతో కూడుకున్న పుండ్లు ఏర్పడడం, చేతులు, కాళ్లపై బొబ్బలు రావడాన్ని గమనించవచ్చని ప్రపంచ ఆరోగ్య సంస్థ తెలిపింది. పిల్లల్లో ఎక్కువగా ఈ వచ్చే వ్యాధి కారణంగా ఎరుపు రంగులో పుండ్లు, దద్దుర్లు, బొబ్బలు రావడం వల్లే ఈ వ్యాధికి

## అగ్రరాజ్యం అమెరికాలో మరోసారి కాల్పులు

- ఎలిమెంటరీ పాఠశాలలో దుండగుడి కాల్పులు
- యువకుడి విచ్చలవిడి కాల్పుల్లో 21మంది మృతి
- మృతుల్లో 19మంది చిన్నారులు ఉన్నట్లు గుర్తింపు
- ఘటనపై తీవ్ర భావోద్వేగానికి గురైన అధ్యక్షుడు జో బైడెన్
- ఇలాంటి నరమేధాలకు ఇక స్వస్తి పలకాలన్న కమలా హ్యారిస్



**టెక్సాస్, మే 25 (అక్షర వెలుగు):** అగ్రరాజ్యం అమెరికాలో మరోసారి కాల్పులు చోటు చేసుకున్నాయి. టెక్సాస్‌లోని ఓ ఎలిమెంటరీ పాఠశాలలో దుండగుడు కాల్పులకు తెగబడ్డాడు. ఈ కాల్పుల్లో 19 మంది చిన్నారులు సహా 21 మంది మృతి చెందారు. మృతుల్లో ఇద్దరు టీచర్లు కూడా ఉన్నారు. మృతి చెందిన

2వ

## టీఆర్‌ఎస్ పాలనే తెలంగాణకు రక్ష

- లేకుంటే కుక్కలు చింపిన విస్తరే
- తెలంగాణను ఆర్థికంగా దెబ్బతీస్తున్న కేంద్రం
- మండిపడ్డ మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్



**నల్గొండ, మే 25 (అక్షర వెలుగు):** టిఆర్‌ఎస్ అధికారంలో ఉంటేనే తెలంగాణకు రక్ష అని, లేకుంటే కుక్కలు చింపిన విస్తరి అవుతుందని శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి అన్నారు. సీఎం

2వ

## సిఎం కెసిఆర్‌ను కలసిన రాజ్యసభ సభ్యులు

తమకు అవకావం ఇచ్చినందుకు కృతజ్ఞతలు



**హైదరాబాద్, మే 25 (అక్షర వెలుగు):** రాజ్యసభ సభ్యుడిగా ఏకగ్రీవంగా ఎన్నికైన సందర్భంగా, కుటుంబ సమేతంగా ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్ రావును ప్రగతి భవన్‌లో శుక్రవారం వద్దిరాజు రవిచంద్ర మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలుపుకున్నారు. అలాగే రాజ్యసభ సభ్యులుగా నామినేషన్ వేసిన అనంతరం, సీఎం కేసీఆర్‌ను ప్రగతి భవన్ లో మర్యాదపూర్వకంగా కలిసి, తమకు అవకాశం కల్పించి నందుకు దీవకొండ దామోదర్ రావు, బండి పార్థసారథి రెడ్డిలు కూడా కృతజ్ఞతలు తెలుపుకున్నారు. ఈ సందర్భంగా ఎంపీ జోగినపల్లి సంతోష్ కుమార్, ఎమ్మెల్సీలు పల్లా రాజేశ్వర్ రెడ్డి, నవీన్ రావు, ఖమ్మం జిల్లా ఎంపీ నామా నాగేశ్వర్ రావు ,ఎమ్మెల్సీ తాతామధు, ఎమ్మెల్యేలు విప్ రేగా కాంతారావు, వనమా వెంకటేశ్వర్ రావు, ఉపేందర్ రెడ్డి, రాములు నాయక్, మెచ్చా నాగేశ్వర్ రావు తదితర ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

## తైక్వాండోలో రజతపతకాలు

పిల్లలను అభినందించిన మంత్రి తలసాని



**హైదరాబాద్, మే 25 (అక్షర వెలుగు):** పిల్లలకు ఆసక్తి ఉన్న రంగాల్లో ప్రోత్సహించాలని, అప్పుడే వారు మరింత ఉన్నతంగా రాణిస్తారని మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ తల్లిదండ్రులకు సూచించారు. సైదాబాద్‌కు చెందిన న్యాయవాది ఫసియోద్దిన్ ఇద్దరు కుమార్తెలు ఉమైమా పాతిమా, సుమమ పాతిమా ఈ నెల 6వ తేదీ నుంచి 8వ తేదీ వరకు జరిగిన నేషనల్ తైక్వాండో చాంపియన్‌షిప్‌లో రజత పతకాలు సాధించారు. ఈ సందర్భంగా కుమార్తెలతో కలిసి ఫసియోద్దీన్ మంత్రి తలసానిని మర్యాదపూర్వకంగా కలిశారు. మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ ను తన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఇంత చిన్న వయసులోనే నేషనల్ జాతీయస్థాయి పోటీల్లో సిల్వర్ మెడల్ సాధించడం చిన్నారుల పట్టుదల, తల్లిదండ్రుల ప్రోత్సాహమే కారణమన్నారు. పతకాలను సాధించిన విద్యార్థులను అభినందించారు. మరింత రాణించేందుకు ప్రభుత్వ పరంగా అన్ని

## ఆర్టీసిని లాభాలను పట్టించే ప్రయుత్నాల్లో ఉన్నాం



సంస్కరణలతోముందుకెళుతున్నాం: సజ్జన్నార్

**హైదరాబాద్, మే 25 (అక్షర వెలుగు):** నష్టాల్లో ఉన్న ఆర్టీసీని లాభాల బాట పట్టిస్తామని టీఎస్ ఆర్టీసీ ఎండీ వీసీ సజ్జనార్ స్పష్టం చేశారు. హైదరాబాద్ అబిడ్స్‌లోని స్మైలింగ్ స్టార్స్ ప్లే స్కూల్‌ను సజ్జనార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుతం టీఎస్ ఆర్టీసీ నష్టాల్లో ఉందన్నారు. గతేడాది రూ. 2,200 కోట్ల నష్టం వచ్చిందని తెలిపారు. నష్టాలను అధిగమించి లాభాలబాట పట్టించేందుకు ఆర్టీసీ యాజమాన్యం కృషి చేస్తోందన్నారు. కొవిడ్‌తో పాటు ఇంధన ధరలు పెరగడంతో ఆర్టీసీ నష్టాల్లో ఉందన్నారు. కార్గో సర్వీస్‌లను

2వ

## తెలంగాణకు పెట్టుబడుల వెల్లువ

➤రైల్వే కోచ్ ఫ్యాక్టరీ ఏర్పాటుకు స్టాడ్లర్ రైల్ అంగీకారం

➤కెటిఆర్ సమక్షంలో దావోస్ వేదికగా ఒప్పందంపై సంతకాలు

**హైదరాబాద్, మే 25 (అక్షర వెలుగు):** దావోస్ వేదికగా తెలంగాణ రాష్ట్రానికి పెట్టుబడులు వెల్లువెత్తుతున్నాయి. ఇప్పటికే పలు కంపెనీలు వందల కోట్ల పెట్టుబడులు పెట్టేందుకు నిర్ణయించిన విషయం తెలిసిందే. తాజాగా తెలంగాణలో రైల్వే కోచ్ ఫ్యాక్టరీని

2వ



## నిర్మల్ ఇరిగేషన్ పనులు త్వరగా పూర్తి చేయాలి

➤చెక్‌డ్యామ్ పనులు గడువులోగా ముగించాలి


➤కాంట్రాక్టర్ల నిర్లక్ష్యంపై మంత్రి మండిపాటు

➤అధికారులతో సమీక్షించిన మంత్రి ఇంద్రకరణ్



3వ


## ఆరోగ్యశ్రీని నిర్వీర్యం చేశారు: జగ్గారెడ్డి



**హైదరాబాద్, మే 25 (అక్షర వెలుగు):** రాష్ట్ర ప్రభుత్వ తీరుపై ఎమ్మెల్యే జగ్గారెడ్డి విమర్శలు గుప్పించారు. ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారన్నారు.

2వ

## మహిళా చట్టాలు అందరూ తెలుసుకోవాలి: సునీత



**యాదాద్రి భువనగిరి, మే 25 (అక్షర వెలుగు):** మహిళా చట్టాలు కేవలం మహిళలే కాదు పురుషులు కూడా తెలుసుకోవాలని, తద్వారా మహిళలకు కల్పించిన హక్కుల పట్ల అవగాహన కలుగుతుందని తెలంగాణ మహిళా కమిషన్ చైర్ పర్సన్ వాకిటి సునీతా లక్ష్మారెడ్డి అన్నారు. ఆడపిల్లలపై సమాజ ఆలోచన విధానంలో కూడా మార్పు రావాలని అన్నారు. యాదాద్రీ జిల్లా పర్యటనలో భాగంగా ప్రభుత్వ బాలికల వసతి గృహమును ఆకస్మిక తనిఖీ చేసి బాలికల వసతి సౌకర్యాలను గురించి తెలుసుకున్నారు. అనంతరం జిల్లాలోని సఖి కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా సఖి నిర్వాహకురాలు లావణ్య ద్వారా సఖి కార్యకలాపాలను అడిగి తెలుసుకొని సఖి కేంద్రం ద్వారా మరిన్ని సేవలందించేందుకు కృషి చేయాలని సూచించారు.

## సంపాదకీయం

# కొర్రాసు నెగడులా కోనసీమ !

ప్రశాంతంగా ఉండే కోనసీమ కొర్రాసు నెగడులా రగులతోంది. గతకొంత కాలంగా కొనసాగుతున్న ఆందోళనలు ఒక్కసారిగా ఉద్రిక్తతలకు దారితీయడం అవాంఛనీయం. ఆందోళనలను పట్టించుకోక పోవడం వల్ల జరిగిన అనర్థంగా దీనిని గుర్తించాలి. ప్రజల్లో ఉన్న ఆగ్రహం కట్టలు తెంచుకునే వరకు పట్టించుకోక పోవడంతో జరిగిన దారుణంగా చూడాలి. ఈ ఆందోళనల వెనక ఎవరున్నా చర్యలు తీసుకోవాల్సిందే. అయితే ప్రతి ఉద్యమం ఇలాగే పరాకాష్టకు చేరుకుంటుంది. ప్రభుత్వాల నిర్లక్ష్యానికి ఇది పరాకాష్టగానే చూడాలి. ప్రజల్లో గూడుకట్టుకుని ఉన్న ఆగ్రహం పసిగట్టలేక పోవడం పాలకుల నిర్లక్ష్యం తప్ప మరోటి కాదు. ఏ ఆందోళన చేసినా ఎందాకా అన్న తెగింపు వ్యవహారాన్ని పాలకులు అలవాటుచేసుకున్నారు. గగతకొన్ని రోజులుగా జిల్లా పేరును మార్చాలని ఆందోళన చేస్తున్న వారితో మాట్లాడి..వారిని అనునయించి ఉంటే ఇంతటి విపత్తు వచ్చేదికాదు. ప్రజలను నిర్లక్ష్యం చేయడం సరికాదని పాలకులు గుర్తించి మసలు కోవాలని కోనసీమ ఆందోళన హెచ్చరిస్తోంది. పచ్చని పొలాలతో నిత్యం కళకళలాడే కోనసీమ ప్రాంతంలో ఘర్షణలు దురదృష్టకరం. హోంశాఖ మంత్రి తానేటి వనిత టీడీపీపై ఆరోపణలు చేసేముందు క్షేత్రస్థాయిలో ముందే పరిస్థితులను బేరీజు వేయకపోవడం ఆమె వైఫల్యంగానూ చూడాలి.ప్రభుత్వ వైఫల్యాన్ని టీడీపీపైనో లేదా ఇతర విపక్షాలపైననో నెట్టడం సరికాదు. ఇది ముమ్మాటికీ పోలీసులు, ప్రభుత్వ వైఫల్యమేనని చెప్పక తప్పదు. పోలీసులు కూడా ప్రజల ఆగ్రహాన్ని అంచనావేయడంలో విఫలం అయ్యారు. గతంలో విజయవాడ లో ఉద్యోగుల ర్యాలీ సందర్భంగానూ ఇలాగే జరిగింది. ఈ పరిణామాల నేపథ్యంలో కోనసీమలో ప్రశాంతత నెలకొనేందుకు ప్రజలంతా సహకరించాలి. తగులబెట్టడాలు వంటి చర్యలు సమర్థనీయం కాదు. కోనసీమ అంటే పచ్చని అందాలకు పెట్టింది పేరు. అటువంటి ప్రకృతి అందాలకు నెలవైన ప్రాంతం రణరంగంగా మారడం సరికాదు. సమస్యలను చర్చల ద్వారా పరిష్కరించుకోవాలి. నిజానికి సమస్యలను గుర్తించి చర్చలకు ఆస్కారం కలిగించి ఉంటే ఆగ్రహజ్వాలలు వచ్చేవి కావు. యుద్ధాన్ని తలపించేలా పరిస్థితి భీకరంగా మారింది. తమ ముట్టడిని కట్టడి చేసి ఉక్కుపాదం మోపారనే ఆగ్రహంతో రగిలిపోయిన ఆందోళన కారులు పెను విధ్వంసానికి దిగారు. ప్రశాంత నిరసనకు ప్రయత్నిస్తే తీరా పోలీసులు లాఠీఛార్జి చేయడంతో రగిలిపోయారు. కట్టలు తెగిన ఆగ్రహంతో రెచ్చిపోయారు. దీంతో పోలీసులపై తెగబడ్డారు. దొరికిన వారిని దొరికినట్టు రాళ్లతో దాడి చేశారు. కనిపించిన బస్సులపై రాళ్లు రువ్వి నిప్పు పెట్టారు. ఈ ఆగ్రహ జ్వాలలు చివరకు అధికార పార్టీ ప్రజాప్రతినిధులకు వ్యాపించింది. మంత్రి విశ్వరూప్ ఇంటికి నిప్పుపెట్టే వరకు దారితీసింది. అక్కడి నుంచి మరో ఎమ్మెల్యే సతీష్ ఇంటికీ పాకింది. అసలేం జరుగుతోందో.. విధ్వంసకాండ ఎక్కడకు పయనిస్తుందో తెలియని భయానక పరిస్థితులకు దారితీసింది. ఎస్పీపైనా రాళ్లదాడి జరగడంతో ఆయన గాయపడ్డారు. అర్ధరాత్రి వరకు ఈ భయానక పరిస్థితులు కొనసాగడం బహుశా కోనసీమ చరిత్రలో ప్రథమంగానే గుర్తించాలి. ఓ రకంగా ప్రజల్లో ఆందోళన ఎటు దారితీస్తుందో పోలీసులు పసిగట్టలేకపోవడం వారి వైఫల్యం తప్ప మరోటికాదు. ఇంతగా ఉడుకుతున్న కోనసీమపై వరుణుడు కరుణించి వాతావరణాన్ని చల్లబర్చాడు. కోనసీమలో మంగళవారం రాత్రి 10.30 గంటలు దాటిన తరువాత భారీ వర్షం కురిసింది. ఉదయం నుంచి వాతావరణం వేడెక్కింది. ఉష్ణోగ్రతలు రికార్డు స్థాయిలో 39 డిగ్రీలు నమోదైంది. గత నాలుగు రోజుల నుంచి ఎండల తీవ్రతకు అల్లాడిపోతున్న ప్రజలు రాత్రి కురిసన వర్షంతో ఉపశమనానికి గురయ్యారు. ఎక్కడికక్కడే వర్షపునీరు రోడ్లపై నిలిచిపోయింది. భారీ ఈదురుగాలులతో కూడిన వర్షం కురిసింది. దీంతో ప్రజలు కొంత ఉపశమనం పొందారు. అమలాపురంతోపాటు పలుచోట్ల వర్షం కారణంగా విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. వానతో చల్లబడ్డవాతావరణం ఇలాగే కొనసాగాలి. ప్రజలు స్వాంతన చేకూరాలి. తొలుత అంబేద్కర్ పేరు జిల్లాకు పెట్టాలని కొందరు డిమాండ్ చేస్తూ ఆందోళనలకు దిగారు. తీరా ప్రభుత్వం పేరు పెట్టాక..మరికొందరు వద్దంటూ..కోనసీమగానే కొనసాగాలన్న ఆందోళనలకు దిగారు. ఈ రెండు సందర్భాల్లోనూ ప్రభుత్వం ప్రేక్షకపాత్ర వహించింది. ఎప్పుడైనా సెంటిమెంట్ వ్యవహా రంతో ఆడుకోకూడదు. జిల్లాల పునర్విభజనలో ఏర్పడిన కోనసీమ జిల్లాను తరవాత కొందరి ఒత్తిడితో..ఆ పేరును డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాగా మార్పుచేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల తీసుకున్న అనూహ్య నిర్ణయం వివాదమైంది. జిల్లా పేరు మార్పు పై దళిత వర్గాలు హర్షం వ్యక్తంచేస్తుంటే మిగిలిన సామాజిక వర్గాలు వ్యతిరేకిస్తూ మంగళవారం చేపట్టిన ఆందోళన అమలాపురంలో తీవ్ర విధ్వంసా నికి దారితీసింది. గతంలో జిల్లాల పునర్విభజన చేస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకున్న సమయంలోనే దళితులు అంబేద్కర్ పేరు పెట్టాలంటూ పెద్ద పెట్టున ఉద్యమం చేపట్టారు. బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాగా నామకరణం చేయాలనే ఏకైక డిమాండుతో విజ్ఞాపన దీక్షలు, లాంగ్‌మార్చ్ పేరిట ఆందోళనలు నిర్వహిం చారు. మంత్రులు విశ్వరూప్, చెల్లుబోయిన వేణు ఆధ్వర్యంలో ఎమ్మెల్యేలు ముఖ్యమంత్రిని కలిసి అంబేద్కర్ పేరు పెట్టాలని వినతిపత్రం ఇచ్చినప్పటికీ సీఎం స్పందించలేదు. దాంతో ఫైనల్ గెజిట్‌లో కోనసీమలో జిల్లాగా పేర్కొంటూ ఉత్తర్వులిచ్చారు. ఆ తరవాత వచ్చిన విజ్ఞప్తులపై స్పందించిన ముఖ్య మంత్రి జగన్ డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాగా మారుస్తూ ఉత్తర్వులు ఇచ్చారు. పేరు మార్పును వ్యతిరేకిస్తూ తొలుత సోషల్ మీడియా ద్వారా తీవ్ర స్థాయిలో ప్రచారోద్యమం చేశారు. ఆ తర్వాత గ్రామ స్థాయిలో ఉద్యమాలు మొదలయ్యాయి. నిజానికి మొగ్గదశలోనే ఈ నిరసనలు గుర్తించి మాట్లాడి వుంటే బాగుండేది. ఇంతటి విధ్వంసం జరిగేది కాదు. ఇప్పటికైనా ఆందోళనకారులను పిలిచి మాట్లాడాలి. మరింత నష్టం జరక్కుండా చూడాలి. దీనిని రాజకీయకోణంలో కాకుండా సమస్య కోణంలో చూడాలి. విపక్షాల మీదకు నెపం నెట్టి వ్యవహరిస్తే మరింత రచ్చ కావడం ఖాయం.

పృద్వీరాజ్ గోసుకొండ
ఎడిటర్

# అవతరణ వేడుకలకు ఏర్పాట్లు

### జిల్లా కలెక్టర్ ముషారఫ్ ఫారూఖీ



**నిర్మల్, మే 25 (అక్షర వెలుగు):** రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు అన్నిఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ ముషారఫ్ ఫారూ ఖీ అధికారులను ఆదేశించారు. ఈ సంవత్సరం అంగరంగ వైభవంగా వేడుకలను ఎన్టీఆర్ మినీ స్టేడియంలో జరుపుకోవడం జరుగుతుందని, అందుకు జిల్లా అధికారులు అన్ని ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. జూన్ 2వ తేదీన నిర్వహించనున్న రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలపై ఇప్పటికే ఆదేశాలు ఇచ్చారు. కరోనా వలన గత రెండు సంవత్సరాలు మామూలుగా జరుపుకోవడం జరిగిందన్నారు. రాష్ట్రప్రభుత్వం మార్గదర్శకాలు, ఆదేశాలకు అనుగుణంగా జూన్ 2న జిల్లా, డివిజన్, మండలం, పంచాయ తీలతో పాటు ప్రభుత్వ కార్యాలయాల్లో జెండా ఆవిష్కరణతో పాటు అన్ని ఏర్పాట్లు చేయాలని అన్నారు. 3 రోజుల పాటు కార్యాలయంలో విద్యుత్ దీపాలతో అలంకరించాలని, ఆసుపత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేయాలని అన్నారు. వేడుకల సందర్భంగా అంత రాయం కలగకుండా నిరంతరం విద్యుత్ సరఫరా చేయాలని తెలిపారు. వివిధ శాఖలకు సంబంధించిన ఆవార్డుల లిస్టును 28వ తేదీలోగా సమర్పించాలని తెలిపారు.సాయంత్రం కవిసమ్మేళనం అంబేద్కర్‌భవన్‌లో ఏర్పాటు చేయడం జరిగిందని, అందరు ఈ కార్యక్రమంలో పాల్గొనాలన్నారు.

# ఆరోగ్యశ్రీని నిర్వీర్యం చేశారు: జగ్గారెడ్డి



(మొదటి పేజి తరువాయి) తెలంగాణలో ఆస్పత్రుల నిర్మాణం చేపట్టలేదన్నారు. ప్రభుత్వం స్పందించకుంటే ప్రత్యేక కార్యాచరణ చేపడతామన్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్యుల సిబ్బంది కొరత ఉందని జగ్గారెడ్డి పేర్కొన్నారు. ఆరోగ్యశ్రీ పథకాన్ని సీఎం కేసీఆర్ తుంగలో తొక్కారన్నారు. కార్పొరేట్ ఆస్పత్రుల్లో సేవలు అందక పేదలు రోడ్డున పడ్డారన్నారు. పేదల ఆరోగ్యంతో ప్రభుత్వం ఆడుకుంటోందని జగ్గారెడ్డి పేర్కొన్నారు.

# వంటనూనెల దిగుమతులపై సుంకం తగ్గింపు

### 2024 మార్చి 31 వరకు పన్నుల మినహాయింపు • కేంద్రప్రభుత్వం నిర్ణయంతో తగ్గనున్న నూనెల ధరలు

**న్యూఢిల్లీ, మే 25 (అక్షర వెలుగు):** సన్ ఫ్లవర్ ఆయిల్, సోయాబీన్ ఆయిల్ దిగుమతిపై కస్టమ్స్ సుంకం, వ్యవసాయ మౌలిక సదుపాయాల అభివృద్ధి సెస్‌లను తొలగిస్తున్నట్లు కేంద్రం ప్రకటించింది. ఏడాదికి 20 లక్షల మెట్రిక్ టన్నుల చొప్పున సన్ ఫ్లవర్, సోయాబీన్ నూనెలపై పన్ను మినహాయింపు వర్తిస్తుందని కేంద్ర ఆర్థిక శాఖ తెలిపింది. దీంతో 2024 మార్చి 31 వరకు మొత్తం 80 లక్షల మెట్రిక్ టన్నుల నూనెల దిగుమతికి పన్ను భారం ఉండదు. దేశంలో వంటనూనెల ధరలు తగ్గి, ద్రవ్యోల్బణం అదుపులోకి వచ్చేందుకు ఉపయోగపడుతందంది. దిగుమతులు కోటా కోసం మే 27 నుంచి జూన్ 18 లోపు సంస్థలు దరఖాస్తు చేసుకోవాల్సి ఉంది. ఈ కోటాకు మించి దిగుమతి చేసుకునే నూనెలకు సుంకాలు మామూలుగా ఉంటాయన్నారు.ప్రస్తుతం వంటనూనెలపై కస్టమ్స్, సెస్ 5.5 శాతం వసూలు చేస్తున్నారు. ఈ పన్ను లేకుంటే సోయాబీన్ ఆయిల్ లీటరుకు 3 రూపాయలు తగ్గుతుందని తెలిపారు ఎక్స్ పర్ట్స్. మరోవైపు పెట్రోల్, డీజిల్ పై ఎక్సైజ్ సుంకాన్ని తగ్గించడం వల్ల రవాణా ఛార్జీల రూపేణ కొంత ఉపశమనం లభిస్తోంది.ఈఏడాది చక్కెర ఎగుమతులను 10 మిలియన్ టన్నులకే పరిమితం చేస్తూ ఆదేశాలు జారీ చేసింది కేంద్రం. తగినంత చక్కెర నిల్వలు అందుబాటులో ఉంచి, ధరలు పెరగకుండా చూసేందుకు ఈ నిర్ణయం తీసుకంది. జూన్ 1 నుంచి ఈ ఆదేశాలు అమల్లోకి వస్తాయి. చక్కెర ఎగుమతులపై ప్రభుత్వం పరిమితులు విధించడం గత ఆరేళ్లలో ఇది తొలిసారి.



# హైదరాబాద్‌కు నేడు ప్రధాని మోడీ రాక

(మొదటి పేజీ తరువాయి) దవాఖాన, మజీద్ బండ కమాన్, హెచ్‌సీయూ డిపో రోడ్ మీదుగా వెళ్లాల్సి ఉంటుంది. విప్రో జంక్షన్ నుంచి లింగంపల్లి వైపు వెళ్లే వాహనాలు.. క్యూ సిటీ, గౌలిదొడ్డి, గోపన్‌పల్లి క్రాస్‌రోడ్, హెచ్‌సీయూ బ్యాక్ గేట్, నల్లగండ్ల మీదుగా వెళ్లాల్సి ఉంటుంది. విప్రో జంక్షన్ నుంచి గచ్చిబౌలి వైపు వెళ్లేవారు ఫెయిర్ ఫీల్డ్ హోటల్, నానక్‌రాంగూడ రోటరీ, ఓఆర్ఆర్ రోడ్, ఎల్ అండ్ టీ టవర్స్ మీదుగా వెళ్లాల్సి ఉంటుంది. కేబుల్ బ్రిడ్జి నుంచి గచ్చిబౌలి జంక్షన్ వైపు వెళ్లే వాహనాలు.. జూబ్లీహిల్స్ రోడ్డు నం.45, మాదాపూర్ పీఎస్, సైబర్ టవర్స్, హైటెక్స్, కొత్తగూడ, బొటానికల్ గా÷–డ్గ÷న్, గచ్చిబౌలి జంక్షన్ మీదుగా దారిమళ్లిస్తున్నట్లు చెప్పారు. ఆంక్షలు అమలులో ఉన్న సమయంలో సిటీలోకి భారీ వాహనాల రాకపోకలను పూర్తిగా నిషేధం విధిస్తున్నామని చెప్పారు. నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గురువారం సాయంత్రం 6 గంటల వరకు ఈ ఆంక్షలు అమలులో ఉంటాయని స్పష్టం చేశారు. ఇదిలావుంటే ప్రధాని పర్యటనకుమరోమారు కెసిఆర్ దూరంగగా ఉంటున్నారు. బుధవారం సాయంత్రం బెంగుళూరుకు సీఎం కేసీఆర్ వెళ్లనున్నారు. దీంతో ప్రధాని పర్యటనకు మరోసారి కేసీఆర్ దూరం కానున్నారు. గురువారం బెంగుళూరు నుంచి అన్నాహజారే స్వగ్రామం రాలె గావ్ సిద్ధి వెళ్లనున్నారు. అటు నుంచి కుటుంబ సభ్యులతో కలిసి షిర్డీ వెళ్లి అక్కడ సాయినాథున్ని దర్శించుకోనున్నారు. 29, 30 తేదీల్లో బెంగాల్, బీహార్ రాష్ట్రాల పర్యటనపై ఇంకా స్పష్టత రాలేదు. అయితే గతంలో కూడా ప్రధాని మోదీ హైదరాబాద్‌కు వచ్చినప్పుడు సీఎం కేసీఆర్ దూరంగానే ఉన్నారు. స్వల్ప జ్వరంతో బాధపడుతుండటంతో అప్పటి ప్రధాని పర్యటనకు కేసీఆర్ దూరంగా ఉన్నారు. ఇప్పుడు మరోసారి బెంగుళూరు టూర్ కారణంగా దూరం కానున్నారు. కేసీఆర్ కావాలనే ఇలా చేస్తున్నారని బీజేపీ శ్రేణులు ఆరోపిస్తున్నాయి.

# టీఆర్ఎస్ పాలనే తెలంగాణకు రక్ష

(మొదటి పేజి తరువాయి) కేసీఆర్ ప్రభుత్వానికి అభివృద్ధి ముఖ్యమని.. కులాలు ముఖ్యం కాదని గుత్తా సుఖేందర్ రెడ్డి స్పష్టం చేశారు. బుధవారం మీడియాతో మాట్లాడుతూ... గత రెండు మాసాలుగా రాష్ట్ర ప్రభుత్వాన్ని కేంద్ర ప్రభుత్వం ఆర్థికంగా ఇబ్బందులకు గురిచేస్తోందన్నారు. ఇది ఫెడరల్ వ్యవస్థకు విఘాతమని, రాష్ట్రాలు బలంగా ఉంటేనే కేంద్రం బలంగా ఉంటుందని తెలిపారు. అభివృద్ధిలో ముందుండే రాష్ట్రాలను కేంద్రం ప్రోత్సహించాలని ఆయన అన్నారు. అయితే అందుకు విరుద్ధంగా ఆర్థికంగా దెబ్బతీసే కుట్ర జరుగుతోందన్నారు. కేంద్ర ప్రభుత్వం కావాలనే తెలంగాణపై కుట్రలు చేస్తున్నదని, రాష్ట్ర ఆర్థిక వనరులను దెబ్బతీసేలా వ్యవహరిస్తున్నదని గుత్తా సుఖేందర్ రెడ్డి అన్నారు. ఫెడరల్ వ్యవస్థకు తూట్లు పొడుస్తూ రాష్ట్రాల అస్తిత్వాన్ని దెబ్బతీయలని చూస్తున్నదని ఆగ్రహం వ్యక్తంచేశారు. రాష్ట్రానికి రావాల్సిన నిధులు రాకుండా కుట్ర చేస్తున్నదని విమర్శించారు. పైగా రాష్ట్ర బీజేపీ నాయకులు తెలంగాణ పరువు పోయేలా మాటలు మాట్లాడుతున్నారని ఫైర్ అయ్యారు. సీఎం కేసీఆర్ నాయకత్వంలో సబ్బండ వర్గాలు సంతోషంగా ఉన్నాయని, అందరికి సంక్షేమ ఫలాలు అందుతున్నాయని చెప్పారు. ప్రతిపక్ష నాయకులు నేడు కులాల గురించి మాట్లాడుతున్నారని, అధికార యావ తప్ప వారికి వేరే ప్రాధాన్యం లేదని విమర్శించారు. తమకు అభివృద్ధి ముఖ్యమని, కులాలు కాదని చెప్పారు. కొన్ని శక్తులు కులాల పెరుచెప్పుకొని అధికారంలోకి రావాలని కుట్రలు పన్నుతున్నాయని ఆగ్రహం వ్యక్తంచేశారు. ప్రజలు ఎప్పుడూ కుల రాజకీయాలను నమ్మరని, అభివృద్ధి చేసినవారికే ఓట్లు వేస్తారని స్పష్టం చేశారు. ఖమ్మం జిల్లాకు చెందిన పార్థసారథిరెడ్డి హెటిరో ఫార్మాతో దేశ అభివృద్ధికి పాటు పడ్డారని చెప్పారు. అలాంటి వ్యక్తికి సీఎం కేసీఆర్ రాజ్యసభ ఇవ్వడం హర్షనియం. విభజన చట్టంలోని అంశాలను అమలు చేసేలా ఆలోచన చేయాలని ప్రధాని మోదీకి విజ్ఞప్తి చేశారు. తెలంగాణకు ఇబ్బంది కలుగకుండా చూడాలని ఆయన కోరారు.

# ఆలయాల అభివృద్ధికి కెసిఆర్ పెద్దపీట

### సోన్ ఆలయ విగ్రహ ప్రతిష్టలో మంత్రి ఇంద్రకరణ్



**నిర్మల్, మే 25 (అక్షర వెలుగు):** రాష్ట్రంలో ఆలయాల అభివృద్ధికి ముఖ్యమంత్రి కేసీఆర్ పెద్దపీట వేస్తున్నారని రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి స్పష్టం చేశారు. సొన్ మండలం న్యూ వెల్మల్ గ్రామంలో రూ. 66 లక్షల నిధులతో నూతనంగా నిర్మించిన శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి ఆలయ విగ్రహ ప్రతిష్ట కార్యక్రమానికి బుధవారం మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి హాజరై పూజలు చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. వెంకటేశ్వర స్వామి ఆలయానికి రూ. 66 లక్షలు నిధులు మంజూరు చేశామని అన్నారు. ఇప్పటివరకు రూ. 30 లక్షలతో పనులు పూర్తి చేసామని తెలిపారు. మరో రూ. 36 లక్షలతో ప్రహరి గోడ, ఇతర అభివృద్ధి పనులు చేస్తామన్నారు. నిర్మల్ నియోజకవర్గంలో దాదాపు 500 పైచిలుకు దేవాలయాలను అభివృద్ధి చేసుకున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పి చైర్ పర్సన్ విజయ లక్ష్మి రాంకిషన్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే వేణుగోపాల్ చారి, అల్లోల మురళీధర్ రెడ్డి , ఎఫ్ఎస్‌సీఎస్ చైర్మన్ ధర్మజి రాజేందర్, సర్పంచ్ హరిత శ్రీనివాస్, జడ్పిటిసి జీవన్ రెడ్డి, మండల నాయకులు మోహినోద్దీన్, కృష్ణ ప్రసాద్, వినోద్, ఆత్మ చైర్మన్ గంగ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణకు పెట్టుబడుల వెల్లువ

(మొదటి పేజి తరువాయి)ఏర్పాటు చేసేందుకు స్టాడ్లర్ రైల్ ముందుకు వచ్చింది. ఈ మేరకు మంత్రి కే తారకరామారావు సమక్షంలో తెలంగాణ ప్రభుత్వంతో కంపెనీ ఎంఓయూ కుదుర్చుకున్నది. రాష్ట్రంలో ఉన్న మేధో సర్వీస్ ప్రైవేట్ లిమిటెడ్ అండ్ స్టాడ్లర్ రైల్ కలిసి ఈ రైల్వే కోచ్ ఫ్యాక్టరీని నెలకొల్పనున్నాయి. ఈ మేరకు స్టాడ్లర్ రైల్ కార్యనిర్వాహక ఉపాధ్యక్షుడు అన్స్ గార్డ్ బ్రోక్ మెయ్, తెలంగాణ పరిశ్రమల శాఖ ముఖ్య కార్యదర్శి జయేష్ రంజన్ దావోస్‌లోని తెలంగాణ పెవిలియన్‌లో కేటీఆర్ సమక్షంలో అవగాహన ఒప్పందంపై సంతకాలు చేశారు. ఒప్పందం మేరకు రానున్న రెండేళ్లలో తెలంగాణలో రూ.1000కోట్లు రైల్వే కోచ్ ఫ్యాక్టరీ స్థాపన కోసం కంపెనీ పెట్టుబడిగా పెట్టనున్నది. ఈ కంపెనీ ఫ్యాక్టరీ స్థాపన తర్వాత తయారుచేసే రైల్వే కోచ్‌లను కేవలం భారత్‌తో పాటు ఏషియా పసిఫిక్ రీజియన్‌కు సైతం ఎగుమతి చేయనున్నట్లు కంపెనీ పేర్కొంది. తెలంగాణ రాష్ట్రంలో తమ రైల్వే కోచ్ ఫ్యాక్టరీ ఏర్పాటు కోసం ముందుకు వచ్చిన స్టాడ్లర్ రైల్ కంపెనీకి మంత్రి కేటీఆర్ ధన్యవాదాలు తెలిపారు. తెలంగాణ రాష్ట్రం నుంచి భారతదేశానికే కాకుండా విదేశాలకు సైతం ఎగుమతి అయ్యేలా రైల్వే కోచ్‌లను తయారు చేయడంపై హర్షం వ్యక్తం చేశారు. పెట్టుబడి ద్వారా తెలంగాణ రాష్ట్రం ప్రపంచ పెట్టుబడులకు ఆకర్షణీయ గమ్యస్థానంగా మారిందనే విషయం మరోసారి నిరూపితమైందన్నారు. కంపెనీ పెడుతున్న రూ.1000కోట్ల పెట్టుబడి ద్వారా 2500 మందికి ఉద్యోగ అవకాశాలు రానున్నాయని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రంలో ఏర్పాటు చేయబోతున్న తమ యూనిట్ కంపెనీకి అత్యంత ప్రాధాన్యంగా మారబోతు న్నదని అని కంపెనీ కార్యనిర్వాహక అధ్యక్షుడు అన్స్ గార్డ్ బ్రోక్ మెయ్ తెలిపారు. తమ కంపెనీ ఏసియా పసిఫిక్ ప్రాంతంలో అభివృద్ధిని సాధించేందుకు ఈ పెట్టుబడి దోహదపడుతుందన్నారు. తెలంగాణ ప్రభుత్వం సంస్థకు అందిస్తున్న సహకారం హర్షం వ్యక్తం చేశారు.

## ఆర్టీసిని లాభాల పట్టించే ప్రయత్నాల్లో ఉన్నాం



(మొదటి పేజి తరువాయి) మెరుగుపరుస్తామన్నారు. ఎలక్ట్రిక్ బస్సులు, కొత్త బస్సులు, నూతన సంస్కరణల ద్వారా రానున్న రోజుల్లో ఆర్టీసీని ప్రగతి పథంలో నడిపిస్తామన్నారు. ఇటీవల అమలు చేసిన మ్యాంగో ఎక్స్‌ప్రెస్ ద్వారా ప్రజల నుంచి మంచి స్పందన లభించిందని సజ్జనార్ పేర్కొన్నారు. ఆర్టీసీని లాభాల్లోకి తేవడమే లక్ష్యంగా కొత్త సంస్కరణలు అమలులోకి తీసుకురాబోతున్నామని ఆయన వెల్లడించారు. సంస్కరణల్లో భాగంగా ఇటీవల తాము ప్రారంభించిన మ్యాంగో ఎక్స్ ప్రెస్ ద్వారా ప్రజల నుండి మంచి స్పందన వచ్చిందని ప్రస్తావించారు. ఈ స్ఫూర్తితో సేవలను పెరుగుపరచుకుంటూ త్వరలోనే ఆర్టీసీ కార్గో సర్వీస్, హాస్పిటల్ సర్వీస్, ఇంటివద్దకే ఆర్టీసీ సేవలను ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నామని ఎండీ సజ్జనార్ వివరించారు.

# అగ్రరాజ్యం అమెరికాలో మరోసారి కాల్పులు



(మొదటి పేజి తరువాయి) విద్యార్థుల వయసు 4 నుంచి 11 ఏళ్ల మధ్య ఉంటుందని అక్కడి అధికారులు తెలిపారు. ఈ పాఠశాలలో మొత్తం 500 మంది విద్యార్థులు చదువుతున్నారు. మెక్సికన్ సరిహద్దులోని ఉవాల్డే నగరంలో అమెరికా కాలమానం ప్రకారం మంగళవారం మధ్యాహ్నం సమయంలో ఈ కాల్పులు చోటు చేసుకున్నాయి. గత కొన్నేళ్లలో ఇది అత్యంత ఘోరమైన ఘటన ఇదేనని రాష్ట్ర గవర్నర్ గ్రేగ్ అబాట్ పేర్కొన్నారు. కాల్పుల నేపథ్యంలో వెంటనే అప్రమత్తమైన పోలీసులు పాఠశాలను తమ ఆధీనంలోకి తీసుకున్నారు. ఈ కాల్పులు జరిపింది 18 ఏళ్ల టీనేజర్‌గా పోలీసులు గుర్తించారని గవర్నర్ తెలిపారు. అంతేగాక పోలీసుల కాల్పుల్లో దుండగుడు మృతి చెందినట్లు గవర్నర్ స్పష్టం చేశారు. కాగా, 2018లో ఫ్లోరిడాలోని పార్క్‌ల్యాండ్‌లో జరిగిన కాల్పుల్లో 14 మంది హైస్కూల్ విద్యార్థులతో సహా ముగ్గురు టీచర్లు మృతిచెందారు. ఈ ఘటన తర్వాత అగ్రరాజ్యంలో ఇదే అత్యంత దారుణ సంఘటనగా పోలీస్ అధికారులు తెలిపారు. ఈ ఘటనపై దేశ అధ్యక్షుడు జో బైడెన్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢసానుభూతి తెలిజేశారు. దేశంలోని గన్ లాబీకి వ్యతిరేకంగా అమెరికన్లు నిలబడాల్సిన సమయం ఆసన్నమైందని ఆయన పేర్కొన్నారు. తల్లిదండ్రులకు పిల్లలు శాశ్వతంగా దూరం కావడం అంటే.. అది వాళ్ల గుండెకు మాయని గాయమని, కొంతకాలం వరకు కోలుకోలేని క్షోభ అంటూ బైడెన్ చెప్పుకొచ్చారు. ఈ సందర్భంగా కారు ప్రమాదం రూపంలో తనకు దూరమైన మొదటి భార్య, కూతురిని అధ్యక్షుడు గుర్తు చేసుకున్నారు. అటు ఉపాధ్యక్షురాలు కమలా హ్యారిస్ కూడా ఈ ఘటనపై విచారం వ్యక్తం చేశారు. ఇలాంటి ఘటనలు ఇక చాలని.. ఇకపై ఇలాంటి వాటికి చోటు ఇవ్వకూడదని పేర్కొన్నారు. దేశం మేలుకోవాల్సిన సమయం ఆసన్నమైందని ఆమె తెలిపారు. మన గుండెలు బద్ధలు అవుతూనే ఉన్నాయి. చర్యలు తీసుకోవడానికి ధైర్యం చేయాలి అని కమలా చెప్పు కొచ్చారు. సల్వడార్ రామోస్ అనే 18 ఏండ్ల యువకుడు మంగళవారం మధ్యాహ్నం ఒంటి గంట సమయంలో ఉవాల్డేలోని రాబ్ ఎలిమెంటరీ స్కూల్‌లోకి ప్రవేశించాడు. తనవెంట తెచ్చుకున్న తుపాకీతో కాల్పులకు తెగబడ్డాడని పోలీసులు చెప్పారు. దీంతో 21 మంది అక్కడికక్కడే చనిపోగా, పలువురు గాయపడ్డారని తెలిపారు. అయితే ఘటన జరిగిన వెంటనే పోలీసులు ఆ స్కూల్‌ను చుట్టుముట్టారని, వారు జరిపిన కాల్పుల్లో గన్‌మ్యాన్ కూడా చనిపోయాడని వెల్లడించారు. కాల్పులకు గల కారణాలు తెలుసుకునేందుకు ఎఫ్‌బీఐ అధికారులు దర్యాప్తు చేస్తున్నారు.

# ఒకేసారి 57మంది డాక్టర్లకు మెమోలు

### ప్రిన్సిపాల్ తీరుపై డాక్టర్ల ఆందోళన

**నల్లగొండ, మే 25 (అక్షర వెలుగు):** నల్గొండ మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ వేధింపులకు గురిచేస్తున్నారంటూ డాక్టర్లు ఆందోళనకు దిగారు. దీంతో ఆస్పత్రి వద్దకొంత ఉద్రిక్తత ఏర్పడింది. విధులకు సరిగా హాజరు కావడం లేదంటూ నల్గొండ మెడికల్ కాలేజీలో పనిచేస్తున్న 57 మంది డాక్టర్లకు నల్గొండ మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ మెమోలు జారీ చేశారు. ప్రిన్సిపాల్ ఈ విషయాన్ని జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. ఒకేసారి 57 మంది డాక్టర్ల కు మెమోలు ఇస్తున్న విషయాన్ని కలెక్టర్ కు ఫోన్లో సుపరిండెంట్ వివరించిన విషయం బయటకు పొక్కింది. తమకు మెమోలు జారీ చేయడంపై డాక్టర్లు అసంతృప్తిని వ్యక్తం చేశారు. కక్ష పూరితంగానే ప్రిన్సిపల్ తమకు మెమోలు జారీ చేశారంటూ ప్రిన్సిపల్ వైఖరిని నిరసిస్తూ ఆస్పత్రిలోని సూపరింటెండెంట్ ఛాంబర్ ఎదుట డాక్టర్లు ఆందోళన చేపట్టారు. ప్రిన్సిపాల్ కక్షపూరితంగా వ్యవహరిస్తున్నారంటూ ఆరోపణలు చేశారు. డాక్టర్ల ఆందోళనతో ఆస్పత్రిలో కొంతసేపు ఉద్రిక్తత ఏర్పడింది.

# ఎస్టీ రిజర్వేషన్లపై మాటతప్పిన కెసిఆర్

### లంబాడీల ఐక్య వేదిక నేత విమర్శలు

**హైదరాబాద్, మే 25 (అక్షర వెలుగు):** లంబాడీలను సీఎం కేసీఆర్ మోసం చేశారని లంబాడీల ఐక్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు రాజ్ కుమార్ జాదవ్ మండిపడ్డారు. ఆమ్ ఆద్మీ పార్టీ రాష్ట్ర కోశాధికారిగా భూక్యా శోభన్ బాబు నాయక్ ను నియమించడం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా నాంపల్లి లోని వేదిక కార్యాలయంలో ఆయనను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా రాజ్ కుమార్ జాదవ్ మాట్లాడుతూ... తాము అధికారంలోకి రాగానే ఎస్టీ రిజర్వేషన్లు పెంచుతామని చెప్పిన కేసీఆర్ మాట తప్పారని ఆరోపించారు. కేసీఆర్ అధికారంలోకి వచ్చి ఎనిమిదేళ్లు దాటినా... ఎస్టీ రిజర్వేషన్ల పెంపుపై కనీసం ప్రస్తావించడంలేదని ్÷ర్ అయ్యారు. ప్రత్యేక ఎస్టీ కమిషన్, ట్రైబల్ యూనివర్సిటీలకు సంబంధించి ఊసెత్తడంలేదని తెలిపారు. లంబాడీలను ఓట్లు వేసే యంత్రాలుగా చూస్తున్న రాజకీయ పార్టీలకు రానున్న ఎన్నికల్లో గుణపాఠం చెబుతామని హెచ్చరించారు. లంబాడీల అభివృద్ధికి ప్రాధాన్యతనిచ్చే వాళ్లకే తమ మద్దతు ఉంటుందని ఆయన స్పష్టం చేశారు.

## ఘనంగా హనుమాన్ జయంతి



**నాగార్జునసాగర్, మే 25( అక్షర వెలుగు):** హనుమాన్ జయంతి వేడుకలు నాగార్జున సాగర్ లో బుధవారము భక్తులు ఘనంగా జరుపుకున్నారు. పైలాన్ కాలనీ లోని సూరి కి వీరాంజనేయ స్వామి దేవాలయంలో నూ ఉదయం నుండి స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు అర్చకులు శంకర్ శర్మ ఆధ్వర్యంలో పూజా కార్యక్రమం నిర్వహించారు మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు ఈ కార్యక్రమానికి భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు ఈ కార్యక్రమంలో మల్లికార్జున రావు లింగం తదితరులు భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. హెల్త్ కాలనీ లోని కెనాన్ ఆంజనేయ స్వామి దేవాలయంలో హనుమాన్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు స్వామివారికి అభిషేకాలు ప్రత్యేక పూజలు నిర్వహించారు మధ్యాహ్నము అన్నదాన కార్యక్రమం కూడా నిర్వహించారు భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు పైలాన్ కాలనీ లోని రామాలయంలో కూడా జయంతి వేడుకలు నిర్వహించారు. హిల్ కాలనీ లోని సత్యనారాయణ స్వామి దేవాలయం కూడా హనుమాన్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు.

## నిరుద్యోగ యువతకు ఎర్రబెల్లి ట్రస్ట్ అండ



### శిక్షణ విద్యార్థులకు మెటీరియల్ అందించి మంత్రి

**వరంగల్, మే 25 (అక్షర వెలుగు):** ఎర్రబెల్లి ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత శిక్షణతో పాటు మెటీరియల్ ను పొంది ఉద్యోగాలు సంపాదించుకోవాలని పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు నిరుద్యోగులకు ఉద్బోధించారు. శిక్షణ పొందుతున్న వారికి ఉచితంగా మెటీరియల్ ను ఆయన పంపిణీ చేశారు. ఈసందర్భంగా మంత్రి ఎర్రబెల్లి మాట్లాడుతూ మెటీరియల్ తీసుకోవడమే కాదు, మీరు ఉద్యోగాలు పొంది మా సంకల్పాన్ని నెరవేర్చాలన్నారు. నిరుద్యోగులకు ఈ ఉచిత శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహిస్తుండటం మా అదృష్టంగా భావిస్తున్నట్టు తెలిపారు. శిక్షణ ద్వారా వేలాది మంది ఉద్యోగాలు, ఉపాధి అవకాశాలు పొందుతున్నారని చెప్పారు. అనేక కుటుంబాలు, ప్రత్యేకించి పెళ్ళై, చదువుకోవడానికి అవకాశాలు లేక ఇబ్బందులు పడుతున్న మహిళలు, దూర ప్రాంతాలకు శిక్షణ కోసం వెళ్లలేని వాళ్ళు, శిక్షణ ఫీజులు భారమైన వాళ్లు ఎందరో బాగు పడుతున్నందుకు సంతోషంగా ఉందన్నారు. గత కొన్నేళ్లుగా ఉషా దయాకర్ రావు అధ్వర్యంలో ఎర్రబెల్లి ట్రస్ట్ సేవ కార్యక్రమాలు జరుగుతున్నాయి. అత్యంత నిజాయితీతో ఈ సేవ జరుగుతున్నది. కరోనా సమయంలో నిరుపేదలకు నిత్యావసర వస్తువులు, అంబులెన్స్ లు వంటివి ఎన్నో చేశాం.అలాగే ఈ ఉచిత ఉపాధి, ఉద్యోగ శిక్షణ కార్యక్రమాలను కూడా నిర్వహించినట్టు తెలిపారు.ఈ శిక్షణ ద్వారా ఇప్పటికే వెయ్యి మందికి పైగా వివిధ ఉద్యోగాలు పొందారని అన్నారు. తన నియోజకవర్గంలోని నిరుద్యోగులకు అందుబాటులో ఉండటానికి వీలుగా అటు తొర్రూరులో తొర్రూరు, రాయపర్తి, పెద్ద వంగర మండలాలకు, ఇటు పాలకుర్తిలో పాలకుర్తి, కొడకండ్ల, దేవరుప్పుల మండలాల వాళ్లకు అందుబాటులో ఉచిత శిక్షణ ఇస్తున్నామని మంత్రి తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజా ప్రతినిధులు, పార్టీ నేతలు, వివిధ ప్రాంతాల నుంచి వచ్చి శిక్షణ తీసుకుంటున్న 750 మంది యువతీ యువకులు తదితరులు పాల్గొన్నారు.

## మళ్లీ పత్తికి మొగ్గుచూపుతున్న రైతులు

### నకిలీ విత్తనాల జోలికి పోవద్దన్న అధికారులు



**ఆదిలాబాద్, మే 25 (అక్షర వెలుగు):** ఊహించినట్టుగానే ఈ ఏడాది కూడా జిల్లాలో పత్తి పంటే అధిక విస్తీర్ణంలో సాగు చేయవచ్చని అధికారులు అంచనా వేశారు. ప్రభుత్వం ప్రోత్సాహంతో ఈ సారి మరో పది వేల ఎకరాల సాగు పెరుగవచ్చని భావిస్తున్నారు. పత్తికి తోడు కంది, వరి, జొన్న, పెసర, మినుములు వంటి ఇతర పంటలను కూడా సాగు చేయవచ్చని అంచనా వేశారు. ఇవి కాకుండా పోషకాహార పంటలైన చిరుధాన్యాల పంటలను సాగు చేసేందుకు ప్రత్యేకంగా చర్య లు చేపడుతున్నారు. ఇందుకు గాను వందశాతం సబ్సిడీపై రైతులకు చిరుధాన్యం విత్తనాలను పంపిణీ చేయనున్నారు. ఇవి కాకుండా ఉద్యానవనశాఖ ద్వారా వివిధ రకాల కూరగాయాల పంటలు సాగు అయ్యే అవకాశాలున్నాయని చెబుతున్నారు. ముఖ్యంగా కాగజ్ నగర్, ఆసిఫాబాద్ పట్టణాలకు సమీపంలో ఉండే మండలాల్లో కూర గాయాల సాగును ప్రోత్సహించేందుకు ప్రత్యేక కార్యాచరణ రూపొందిస్తున్నారు. జిల్లాలో పత్తి సాగుకు సంబంధించి యేటా అంచనాలకు మించి ఉంటున్న నేపథ్యంలో సీజన్ ప్రారంభమైన తర్వాత సాగు విస్తీర్ణం కాస్తా అటు ఇటుగా మారే అవకాశాలున్నాయని చెబుతున్నారు. దుక్కులు చేస్తూ తొలకరి వర్షానికే విత్తనాలు పెట్టేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. మెట్ట పంటలను పక్కన పెడితే వరి సాగులో జీలుగ పంటను నాటి రసాయన ఎరువుగా రైతాంగం ఉపయోగిస్తున్నది. విత్తనాలను జిల్లాలోని మండలాల పరిధిలో ఉన్న ఆగ్రో సెంటర్లు, ప్రాథమిక సహకార సంఘాలు, సీసీ ఎం ఎస్ విక్రయ కేంద్రాల్లో అందు బాటులో ఉంచారు. జిలుగ విత్తనాలను కావాలనుకునే రైతాంగం సంబంధిత మండలాలకు చెందిన వ్యవసా యాధికారుల నుంచి ధ్రువీకరణ పత్రం తీసుకొని కొనుగోలు కేంద్రాల్లో రాయితీపై ఈ విత్తనాలను పొందే వీలు కల్పించారు. అవసరమైన ఎరువులు, విత్తనాలు..వానాకాలం పంటల సాగుకు రైతులకు అవసరమైన ఎరువులు, విత్తనాలను అందుబాటులో ఉంచేందుకు జిల్లా వ్యవసాయ శాఖ కసరత్తు పూర్తి చేసింది. రైతులు ఏ విత్తనం కొనుగోలు చేసినా దుకాణాల నుంచి రశీదులు తప్పకుండా తీసుకొని భద్రపరుచుకోవాలన్నారు.విత్తనాల నాణ్య తలేని కారణంగా రైతులు పంటలు నష్టపోతే ఆ రశీదుల ఆధారంగా సదరు కంపెనీలపై చర్యలు తీసుకునే అవకాశం ఉంది.

## బిసిల అభ్యున్నతిపై అధ్యయనం

### కర్నాటక బిసి కమిషన్‌తో వకుళాభరణం భేటీ



**హైదరాబాద్, మే 25 (అక్షర వెలుగు):** సామాజిక, విద్య, ఉపాధి,ఆర్థిక, రాజకీయ రంగాలు, సంప్రదాయ పద్దతులలో బిసిల వాస్తవిక జీవన స్థితిగతులను నిర్దిష్టంగా సమాచారాన్ని సేకరించడానికి తెలంగాణ బిసి కమిషన్ కసరత్తు వేగవంతం చేసింది. ఇటీవల తెలంగాణ ప్రభుత్వం ఉత్తర్వులలో ఇచ్చిన 'టర్మ్స్ ఆఫ్ రెఫరెన్స్'కు అనుగుణంగా రాష్ట్ర బిసి కమిషన్ అధ్యయనం మొదలు పెట్టింది. అందులో భాగంగా బుధవారం కర్నాటక బిసి కమిషన్ తో సుదీర్ఘంగా భేటీ అయ్యింది. తెలంగాణ బిసి కమిషన్ ఛైర్మన్ వకుళాభరణం కృష్ణమోహన్ రావు సారధ్యంలో సభ్యులు సిహెచ్ ఉపేంద్ర, శుభప్రద్ పటేల్ నూలి, కిశోర్ గౌడ్ తో కూడిన బృందం కర్నాటక బిసి కమిషన్ ఛైర్మన్ జయప్రకాశ్ హెగ్డే, సభ్యులు రాజశేఖర్ బిఎస్, కళ్యాణ్ కుమార్, సువర్ణ, అరుణ్ కుమార్, శారదనాయక్, సభ్యకార్యదర్శి కెఎ దయానంద్ తో సమావేశమయ్యారు. సుదీర్ఘంగా చర్చించారు. గత కర్నాటక బిసి కమిషన్లు హవనూర్, వెంకటస్వామి, కాంతారాజ మొదలైనవి చేపట్టిన సమగ్ర సర్వే పై వివరాలను అడిగి తెలుసుకున్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బిసి రిజర్వేషన్ల కొనసాగింపులో సుప్రీమ్ కోర్టు నిర్దేశించిన 'ట్రిబుల్ టెస్ట్'కొలమానాల నేపథ్యంలో ఇరు కమిషన్లు ప్రత్యేకంగా చర్చించాయి. ఉత్పన్నమైన న్యాయపరమైన సమస్యలు, కార్యరంగంలో ఎదుర్కొన్న ఇబ్బందులను ఇతర అంశాలపై వివరాలను సేకరించారు. పరిష్కార మార్గాలను అడిగి తెలుసుకున్నారు. గత కర్నాటక కమిషన్లు రూపొందించిన మెథడాలజీ, ప్రశ్నావళి, అవలంభించిన పద్దతుల పై ఆరా తీశారు. ఇందుకు సంబంధించిన అన్ని పత్రాలను, ఉత్తర్వులను, చట్టాలను కర్నాటక బిసి కమిషన్ నుంచి సేకరించారు

## రాష్ట్రంలో పెట్టుబడులకు ఆసక్తి

### ష్నైడర్ కంపెనీతో మంత్రి కెటిఆర్ చర్చలు



**హైదరాబాద్, మే 25 (అక్షర వెలుగు):** తెలంగాణకు పెట్టుబడుల ప్రవాహం కొనసాగుతూనే ఉంది. అంతర్జాతీయ స్థాయి కంపెనీలు రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు ఆసక్తి చూపుతున్నాయి. దావోస్ వేదికగా రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి కేటీఆర్.. రాష్ట్రంలో పెట్టుబడులకు ఉన్న అవకాశాలను సవివరంగా తెలుపుతున్నారు. ఈ క్రమంలో పలు కంపెనీలు పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వస్తున్నాయి. ఇప్పటికే పలు కంపెనీలు పెట్టుబడులు పెడుతామని ప్రకటించగా, తాజాగా మరో కంపెనీ ముందుకొచ్చింది. రాష్ట్రంలో మరో యూనిట్‌ను ఏర్పాటు చేసేందుకు ష్నైడర్ ఎలక్ట్రిక్ కంపెనీ సిద్ధమైంది. దావోస్‌లో మంత్రి కేటీఆర్‌తో ష్నైడర్ కంపెనీ ప్రతినిధి చర్చించి ఈ విషయాన్ని ప్రకటించారు. కంపెనీ విస్తరణ ప్రణాళికలపై ష్నైడర్ కంపెనీ ప్రతినిధులు కేటీఆర్‌తో చర్చించారు. ప్రపంచ స్థాయి ప్రమాణాలతో రెండో యూనిట్ ఏర్పాటు చేస్తామని ప్రకటించారు. ఈ సందర్భంగా ష్నైడర్ కంపెనీ ప్రతినిధులకు కేటీఆర్ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

## అమలాపురం ఘటనలు బాధాకరం

### మంత్రి,ఎమ్మెల్యేల ఇంటిపై దాడి దారుణం

### దాడికి పాల్పడ్డ వారిపై చర్య తీసుకోవాలి: గజ్జెల కాంతం



**హైదరాబాద్, మే 25 (అక్షర వెలుగు):** అమలాపురంలో మంత్రి విశ్వరూప్, ఎమ్మెల్యే సతీష్ ఇంటిపై జరిగిన దాడిని ప్రజా సంఘాల చైర్మన్ గజెల కాంతం తీవ్రంగా ఖండించారు. దాడికి పాల్పడినవారి పట్ల కఠిన చర్యలు తీసుకోవాలని, వారిపై పీడీ యాక్ట్ కింద కేసులు నమోదు చేయాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అంబేద్కర్ కోనసీమ జిల్లాగా పేరు ప్రకటించడంపై అభ్యంతరం తెలపడాన్ని నిరసిస్తున్నామన్నారు. కొనసీమ జిల్లా పేరును డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాగా మారుస్తూ ఏపీ ప్రభుత్వం ప్రాథమిక నోటిఫికేషన్ జారీ చేసింది. అయితే దీనిపై ఏవైనా అభ్యంతరాలు ఉంటే చెప్పేందుకు నెల రోజుల సమయం కేటాయించింది. ఈ నేపథ్యంలో జిల్లా పేరును మారమార్చొద్దంటూ కోనసీమ జిల్లా సాధన సమితి అమలాపురంలో మంగళవారం భారీఎత్తున ఆందోళన నిర్వహించింది. అదికాస్తా అదుపుతప్పి హింసాత్మకంగా మారిన విషయం తెలిసిందే. అయితే ఈ ఘటనతో సంబంధం ఉన్నవారు ఏ పార్టీకి చెందినవారైనా, ఎంతటి వారైనా కఠిన చర్యలు తీసుకోవాలని గజ్జల కాంతం డిమాండ్ చేశారు. మూడు రోజుల్లో అమలాపురం వెళ్తామని, దాడి జరిగిన ప్రాంతాన్ని సందర్శిస్తామని,మంత్రి విశ్వరూప్, ఎమ్మెల్యేకు అండగా నిలుస్తామని ఆయన చెప్పారు.

## నిర్మల్ ఇరిగేషన్ పనులు త్వరగా పూర్తి చేయాలి

(మొదటి పేజి తరువాయి) **హైదరాబాద్, మే 25 (అక్షర వెలుగు):** నిర్మల్ జిల్లాలో కొనసాగుతున్న ఇరిగేషన్ ప్రాజెక్టుల పనులను సాధ్యమైనంత త్వరగా పూర్తి చేసి పంటలకు సాగునీరు అందేలా చూడాలని అటవీ, పర్యావరణ, దేవాదాయశాఖ మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి అధికారులను ఆదేశించారు. కాళేశ్వరం ప్రాజెక్టుల భాగంగా చేపట్టిన పనులు పూర్తి చేయడంలో కాంట్రాక్టర్ నిర్లక్ష్యంపై మండిపడ్డారు. అరణ్య భవన్‌లో సమీక్ష సమావేశం నిర్వహించారు.ప్యాకేజీ 27, 28, సదర్‌మాట్ బ్యారేజీ, చెక్ డ్యామ్ నిర్మాణాలు, చెరువుల మరమ్మత్తులు, పునరుద్ధరణ పనులపై ఈ సమావేశంలో సమగ్ర చర్చించారు. గతేడాది కురిసిన భారీ వర్షాల వల్ల నిర్మల్ జిల్లాల్లో 110 చెరువులు, కుంటలకు గండ్లుపడ్డాయని, వాటి పునరుద్ధరణ పనులు ఎంత వరకు వచ్చాయని మంత్రి ఆరా తీశారు. ఇప్పటివరకు 28 చెరువులు, కుంటల పునరుద్ధరణ పనులు పూర్తి అయ్యాయి, మిగితా పనులు కొనసాగుతున్నాయని అధికారులు వివరించారు. దీనిపై మంత్రి స్పందిస్తూ మొదటి విడతలో నిర్మల్ జిల్లాలో చేపట్టిన 21 చెక్ డ్యాంల నిర్మాణ పనుల్లో 18 చెక్ డ్యాంల పనులు పూర్తి అయ్యాయని, మిగిలిన 3 చెక్ డ్యాంల పనులు కొనసాగుతున్నాయని అధికారులు వివరించారు. మరోవైపు రెండవ దశలో సుమారు 43 చెక్ డ్యాంల నిర్మాణానికి ప్రతిపాదనలు పంపామని చెప్పారు. ప్రస్తుతం 150 కోట్లతో 25 చెక్ డ్యాం (నిర్మల్ జిల్లాలో 23, మంచిర్యాల జిల్లా జన్నారం పరిధిలో 2) ల నిర్మాణానికి ఎస్టిమేట్స్ సిద్ధం చేసి టెండర్లు నిర్వహించాలని మంత్రి ఆదేశించారు. జూలై లోగా చెరువులకు నీళ్లు అందించేలా నీటి పారుదల శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. సదర్మాట్ బ్యారేజ్ గేట్ల బిగింపు పక్రియను మరింత వేగవంతం చేయాలన్నారు. ప్యాకేజీ- 28 లో కాంట్రాక్టర్ పనులు చేపట్టకపోవడంతో పాత టెండర్లను రద్దు చేసి, కొత్తగా టెండర్లు చేపట్టే పక్రియను త్వరితగితన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.ముధోల్ నియోజకవర్గంలోని గుండెగాం ముంపు సమస్యను త్వరగా పరిష్కరించాలని ముథోల్ ఎమ్మెల్యే విఠల్ రెడ్డి కోరారు. దీనిపై మంత్రి స్పందిస్తూ వెంటనే పునరావాస చర్యలు చేపట్టాలన్నారు. ఈ సమావేశంలో ఇరిగేషన్ స్పెషల్ చీఫ్ సెక్రటరీ రజత్ కుమార్, నీటిపారుదల శాఖ ఈఎన్సీ (జనరల్) మురళీధర్, ఉమ్మడి ఆదిలాబాద్ ఇంచార్జ్ సీఈ ఎన్, వెంకటేశ్వర్లు, ఎస్‌ఈ సుశీల్ కుమార్, ఈఈ రామారావు, తదితరులు పాల్గొన్నారు.

## టింబర్ డిపో కోసం 80వేలు లంచం

### అటవీ అధికారిని పట్టుకున్న ఎసిబి



**హైదరాబాద్, మే 25 (అక్షర వెలుగు):** రంగారెడ్డి జిల్లా శంషాబాద్ అటవీ అధికారి శ్యామ్‌ను అవినీతి నిరోధక శాఖ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఓ వ్యక్తి నుంచి లంచం తీసుకుంటుండగా ఎఫ్ఆర్‌వోతో పాటు విరియా నాయక్ అనే వ్యక్తిని సైతం అధికారులు అదుపులోకి తీసుకున్నారు. టింబర్ డిపో అనుమతి కోసం రూ.80 వేలు లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. ఎఫ్ఆర్‌వో అవినీతిపై పూర్తిస్థాయిలో దర్యాప్తు చేయనున్నట్లు ఏసీబీ డీఎస్పీ సూర్యనారాయణ తెలిపారు. శంషాబాద్ ఎఫ్ఆర్‌వో శ్యామ్ కార్యాలయంతో పాటు నివాసంలో అధికారులు సోదాలు నిర్వహించారు. శంషాబాద్ కోత్వాల్ గూడలో టింబర్ డిపో అనుమతి కోసం లంచం అడుగుతున్నారని తార్నాకకు చెందిన వెంకటేశ్ అనే వ్యక్తి ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. ఈ మేరకు అధికారులు ఎఫ్ఆర్‌వోను పట్టుకున్నారు.

## కాంగ్రెస్ అతిపెద్ద పార్టీ

### నేతలు వస్తుంటారు..పోతుంటారు

### సిబల్ రాజీనామాపై కెసి వేణుగోపాల్ స్పందన



**న్యూఢిల్లీ, మే 25 (అక్షర వెలుగు):** పార్టీ సీనియర్ నేత కపిల్ సిబల్ గుడ్‌బై చెప్పడంపై కాంగ్రెస్ స్పందించింది. పార్టీ నుంచి నేతలు పోతుంటారు.. వస్తుంటారు.. ఎవర్నీ నిందించలేమని పార్టీ సంస్థాగత వ్యవహారాల కార్యదర్శి కేసీ వేణుగోపాల్ పేర్కొన్నారు. ఇప్పటికే పార్టీ అధ్యక్షురాలు సోనియాకి ఆయన లేఖ రాశాని, కాంగ్రెస్ సిద్ధాంతాన్ని తాను నమ్ముతానని మాత్రం అందులో పేర్కొన్నారని, అంతకు మించి, సిబల్ ఏమీ అనలేదని కేసీ వేణుగోపాల్ వెల్లడించారు. అయితే.. సిబల్ తన వైఖరిని పూర్తిగా పేర్కొనలేదని, పూర్తిగా పేర్కొన్న తర్వాతే మరింత స్పందించడానికి వీలవుతుందని కేసీ వేణుగోపాల్ అన్నారు. కాంగ్రెస్ పార్టీ చాలా పెద్దపార్టీ అని, అనేక మంది నేతలు వస్తుంటారు? పోతుంటారని అన్నారు. పార్టీని వీడి వెళ్లేవారెవర్నీ తాను నిందిచాలని భావించడం లేదని కేసీ వేణుగోపాల్ స్పష్టం చేశారు. పార్టీని అతి త్వరలోనే పునర్వవస్థీకరిస్తామని, అందరికీ అందులో బాధ్యతలుంటాయని వెల్లడించారు. మోదీ ప్రభుత్వం కేంద్ర దర్యాప్తు సంస్థలను ఉపయోగించి విపక్ష నేతలను వేధిస్తోందని కేసీ వేణుగోపాల్ ఆరోపించారు. ఏ ప్రభుత్వం కూడా ఉపయోగించని పద్ధతులను ఉపయోగిస్తూ? మోదీ ప్రభుత్వం ప్రతిపక్ష నేతలను వేధిస్తోందని మండిపడ్డారు. ఈ పరిణామాలను కచ్చితంగా అధిగమిస్తామన్న నమ్మకం తమకుందని కేసీ వేణుగోపాల్ అన్నారు.

## వ్యాపారంలో మునిగిపోయిన మంత్రి

### జగదీశ్వర్ రెడ్డిపై ఎంపి కోమటిరెడ్డి విమర్శలు





**నల్గొండ, మే 25 (అక్షర వెలుగు):** అభివృద్ధి విషయంలో నల్గొండ జిల్లాకు అన్యాయం చేస్తూ ఓ పనికిమాలిన మంత్రిని నియమించారని ఎంపీ కోమటిరెడ్డి వెంకటరెడ్డి వ్యాఖ్యానించారు. బుధవారం మీడియాతో మాట్లాడుతూ... జిల్లా మంత్రి జగదీష్ రెడ్డి భూఅక్రమాలకు, ఇసుక అక్రమ రవాణాకు పాల్పడుతున్నారని ఆరోపించారు. సూర్యాపేట జిల్లా కేంద్రంలో రియల్ ఎస్టేట్ దందా కోసం కలెక్టరేట్ స్థలాన్ని మార్చి వందల కోట్లు సంపాదించారన్నారు. బినామీల పేరుతో తమ సొంత మండల కేంద్రమైన నార్కట్ పల్లి పెద్ద చెరువు 40 ఎకరాల భూమిని కబ్జా చేసి వెంచర్ నిర్మించాలని ప్రయత్నిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనిపైన కలెక్టర్‌కు ఫిర్యాదు చేశామని...సంబంధిత అధికారులు చర్యలు తీసుకోకుంటే తామే రంగంలోకి దిగుతామని ఎంపీ కోమటిరెడ్డి వెంకటరెడ్డి స్పష్టం చేశారు.

## వానాకాలం పంటల సాగుకు యాక్షన్‌ప్లాన్

### వరితో పాటు ఆరుతడి పంటలకు ప్రోత్సాహం ● విత్తనాలు, ఎరువులు సిద్ధం చేస్తున్న అధికారులు




**నిజామాబాద్, మే 25 (అక్షర వెలుగు):** జిల్లాలో వానాకాలం పంటల సాగుకు వ్యవసాయాశాఖ 2022-23 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి కార్యాచరణ సిద్ధం చేసింది. ఈ యేడాది రుతుపవనాలు జూన్ మొదటి వారంలోనే వచ్చే అవకాశం ఉంటుందన్న వాతావరణ శాఖ అంచనాల నేపథ్యంలో జిల్లా వ్యవసా యాధికారులు పంటల సాగు ప్రణాళిక సిద్ధం చేశారు. వానాకాలంలో రైతులకు పంటలపై అవగాహన కల్పించడంతో పాటు ఆరుతడి పంటలను ప్రోత్సహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. పంటల కాలనీ ఏర్పాటులో భాగంగా వరి సాగులో అత్యాధునిక పద్దతులను రైతులు అవలంభించేవిదంగా ప్రయత్నాలు చేస్తున్నారు. వరిలో విత్తనాలు వెదజల్లే పద్ధతిని ప్రొత్సహించేందుకు సిద్ధమవుతున్నారు. వానకాలం సీజన్‌లో సరిపడా విత్తనాలు, ఎరువులను సమకూరుస్తునే సీజన్ ప్రారంభానికి ముందే అన్ని క్లస్టర్‌ల పరిధిలో రైతులకు అత్యాధునిక పద్ధతులను వివరించేందుకు ఏర్పాట్లను చేస్తున్నారు. జిల్లాలో వానాకాలం ప్రణాళికను ఖరారు చేశామని జిల్లా ఇన్‌చార్జీ వ్య వసాయ అధికారి తిరుమల ప్రసాద్ తెలిపారు. రైతుల సాగుకు ఇబ్బందు లు లేకుండా ఏర్పాట్లు చేస్తున్నట్టు చెప్పారు. జిల్లాలో వరిసాగు ఎక్కువగా ఉన్నందు వల్ల ఈ పంటను అత్యాధునిక పరిజ్ఞానంతో పండించే విధంగా రైతులకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. ఖర్చు తగ్గించి ఎక్కువ దిగుబడి వచ్చే పద్ధతులను రైతులకు వివరిస్తున్నామని తెలిపారు. జిల్లాలో వరితో పాటు ఆరుతడి పంటలను కూడా ఎక్కువమొత్తంలో సాగయ్యే విధంగా రైతులను ప్రోత్సహిస్తున్నామని తెలిపారు. విత్తనాభివృద్ధి సంస్థ ద్వారా కొన్ని రకాల విత్తనాలు సరఫరా చేస్తున్నామని, ఇతర విత్తనాలను ప్రైవేట్ విత్తన సంస్థల ద్వారా కొనుగోలు చేసుకోవాలన్నారు. వానకాలం సీజన్‌లో ఏ పంటలు ఎక్కువగా పెరగనున్నాయో యాక్షన్ ప్లాన్‌లో పొందుపర్చారు. ప్రభుత్వం ఆదేశాల ప్రకారం రైతులకు ఆరుతడి పంటల సాగును వివరించడంతో పాటు శాస్త్రీయ పరిజ్ఞానాన్ని అందించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ వానాకాలంలో 5లక్షల 9వేల 753 ఎకరాల్లో పంటలు సాగవుతాయని అంచనా వేశారు. ఈ మొత్తం పంటల్లో 79శాతం వరకు 4లక్షల వెయ్యి 591 ఎకరాల్లో వరి సాగవుతుందని అంచనా వేశారు. పంటలకు అనుగుణంగా విత్తనాలను సమకూర్చాలని ప్రభుత్వానికి పంపిన ప్రణాళికల్లో పేర్కొన్నారు. జిల్లాలో పత్తి సాగును కొత్తగా మొదలుపెడుతున్నందు వల్ల మొత్తం 4600 ప్యాకెట్లు అవసరమని ప్రణాళికలో పొందుపర్చారు. వీటితో పాటు సబ్సీడిపై జీలుగ విత్తనాలను ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాల ద్వారా సరఫరా చేయనున్నారు. వెదజల్లే పద్ధతికి ప్రోత్సాహం జిల్లాలో వచ్చే వానాకాలం సాగుకోసం వరిలో వెదజల్లే పద్ధతిని ప్రోత్సహించేందుకు అధికారులు సిద్ధమవుతున్నారు. వ్యవసాయంలో ఖర్చు తగ్గించడంతో పాటు దిగుబడి పెంచడంలో భాగంగా ఈ పద్ధతిని రైతులకు అవగాహన కల్పిస్తున్నారు. వానాకాలంలో రైతులకు అవసరమైన రుణ ప్రణాళికను కూడా లీడ్ బ్యాంక్ ఆధ్వర్యంలో ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. ఈ నెలాఖరులో రుణ ప్రణాళికను ప్రకటించనున్నారు. రైతులకు ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేస్తున్నారు.




# చలన చిత్రం

## ఫిట్‌నెస్ సెంటర్ల ఏర్పాటులో మన బ్యూటీలు





హీరోయిన్లు కేవలం గ్లామర్ రోల్స్‌కే పరిమితం కాకుండా కథానాయిక ప్రాధాన్యత ఉన్న పాత్రలు చేస్తుంటారు. అలాగే తమలోని సింగర్ వంటి వివిధ కళలను బయటపెడుతుంటారు. హీరోయిన్లు ఓ పక్క నటిస్తూనే మరోపక్క నిర్మాతలుగా కూడా వ్యవహరిస్తున్న విషయం తెలిసిందే. అంతేకాకుండా మంచి ఫామ్‌లో ఉన్నప్పుడే పలు వ్యాపార రంగాల్లో కూడా సక్సేస్ అయ్యేందుకు కృషి చేస్తున్నారు మన కథానాయికలు. ఇలా బిజినెస్‌లోనే కాకుండా ఫిట్‌నెస్ రంగంలోకి దిగుతున్నారు ఫిట్‌నెస్ బ్యూటీలు. ఇప్పటికే కూల్ బ్యూటీ రకుల్ ప్రీత్ సింగ్‌కు ఎఫ్ 45 పేరుతో హైదరబాద్‌తోపాటు వైజాగ్‌లో జిమ్‌లు ఉన్న విషయం తెలిసిందే. ప్రస్తుతం ఈ ఫిట్‌నెస్ బ్యూటీకి మరో బ్యూటీ పోటీ రానుంది. ఆ భామ ఇంకెవరో కాదు.. 'వన్ నేనొక్కడినే' సినిమాతో తెలుగు తెరకు పరిచయమైన కృతి సనన్. ది ట్రైబ్ అనే జిమ్ సెంటర్‌ను ప్రారంభిస్తున్నట్లు సోషల్ మీడియా ద్వారా తెలిపింది ఈ ఫిట్‌నెస్‌గుమ్మ. '8 ఏళ్ల క్రితం నటిగా హిందీ చిత్ర పరిశ్రమలో నా ప్రయాణాన్ని ప్రారంభించాను. సరిగ్గా అదే రోజున ముగ్గురు సూపర్ టాలెంటెడ్ కో-ఫౌండర్లు అనుష్క నందానీ, కరణ్ సాహ్నీ, రాబిన్ బెహ్ల్‌లతో కలిసి ఒక వ్యాపారవేత్తగా ది ట్రైబ్‌ను లాంచ్ చేస్తున్నందుకు ఎంతో సంతోషంగా ఉంది.' అని కృతి సనన్ ట్వీట్ చేసింది. ప్రస్తుతం ఈ పోస్ట్ నెట్టింట వైరల్ అయింది. దీనికి సంబంధించిన యాప్‌ను వచ్చే సంవత్సరం ప్రవేశపెట్టనుంది. తను నటించిన 'మిమి' సినిమాలో పాత్ర తన ఫిట్‌నెస్‌కు స్ఫూర్తినిచ్చిందని కృతి పేర్కొంది.

## జూన్ 3న విడుదలకు సిద్ధంగా మేజర్




వైవిధ్యమైన కథలను ఎంచుకుంటూ కెరీర్లో దూసుకుపోతున్న యంగ్ హీరో అడవిశేష్ తాజాగా నటించిన మేజర్ సినిమా పాన్ ఇండియా రేంజ్ లో విడుదల కానుంది. దేశభక్తి కలిగిన సోల్జర్‌గా ఉద్వేగ సన్నివేశాలు గల కథాంశంతో ఈ మూవీ తెరకెక్కించారు. గతంలో విడుదలైన ఈ సినిమా టీజర్ కు మంచి స్పందన రావడంతో సినీ ప్రేక్షకులు మూవీ రిలీజ్ కోసం ఆత్రుతగా ఎదురుచూస్తున్నారు. తెలుగులోనే కాకుండా హిందీ, మలయాళంలోనూ రాబోతున్న ఈ సినిమాను మహేశ్ బాబు యొక్క జీఎంబీ ఎంటర్ టైన్మెంట్ ఏప్లస్ ఎస్ మూవీస్ తో కలిసి సోనీ పిక్చర్ ఫిల్మ్ ఇండియా నిర్మించింది. షూటింగ్ ఎప్పుడో పూర్తయినా... కరోనా కారణంగా ఎన్నో అవాంతరాలను ఎదుర్కొన్న ఈ చిత్రానికి సంబంధించి తాజాగా ఓ అప్ డేట్ వచ్చింది. మేజర్ సినిమాలోని హృదయమా అనే సాంగ్ ను కళాశాల విద్యార్థులతో కలిసి మూవీ మేకర్స్ పూణెలో రిలీజ్ చేశారు. సింగర్ సిద్ శ్రీరామ్ ఆలపించిన ఈ పాటకు మంచి రెస్పాన్స్ వస్తోంది. మే 27న విడుదల కానున్నట్టు ప్రకటించినా.. చివరకు జూన్ 3న ఈ సినిమాను ప్రపంచ వ్యాప్తంగా విడుదల చేస్తున్నామని చిత్ర నిర్వాహకులు వెల్లడించారు. ఇదిలా ఉండగా 26/11 ముంబై దాడుల్లో దేశం కోసం ప్రాణాలను అర్పించిన మేజర్ సందీప్ ఉన్నికృష్ణన్ జీవితాన్ని ఈ చిత్రంలో ప్రధానంగా చూపించనున్నట్టు తెలుస్తోంది.

## అఖిల్‌కు ప్రతినాయకుడిగా మమ్ముట్టి



అక్కినేని నవయువ కథానాయకుడు అఖిల్ 'మోస్ట్ ఎలిజిబుల్ బ్యాచ్‌లర్' చిత్రంతో తన కెరీర్ లోనే తొలి హిట్ అందుకున్నాడు. ఆ సినిమా తెచ్చిపెట్టిన సక్సెస్ కిక్‌తో తదుపరి చిత్రం 'ఏజెంట్' లో చాలా ఉత్సాహంగా నటిస్తున్నాడు. అందులోని పాత్రకోసం వెరైటీ మేకోవర్‌తో, సిక్స్ ప్యాక్ బాడీతో అభిమానుల్ని మెప్పించే ప్రయత్నం చేస్తున్నాడు. ఈ సినిమాలోని అతడి గెటప్‌కు మంచి రెస్పాన్స్ వచ్చిన సంగతి తెలిసిందే. మెగాస్టార్ చిరంజీవి తో 'సైరా నరసింహారెడ్డి' తర్వాత దర్శకుడు సురేంద్ర రెడ్డి తెరకెక్కిస్తున్న చిత్రం కావడంతో 'ఏజెంట్' చిత్రంపై భారీ అంచనాలు నెలకొన్నాయి. సినిమా ఆగస్ట్ 12న ప్రపంచ వ్యాప్తంగా థియేటర్స్‌లో విడుదల కానుంది. హాలీవుడ్ సూపర్ హిట్ 'బార్న్ సిరీస్ ఆధారంగా రూపొందుతోన్న ఈ సినిమా ప్రస్తుతం మనాలిలో హై యాక్టేన్ యాక్షన్ సీక్వెన్సెస్ చిత్రీకరణ జరుపుకుంటోంది. ఈ విషయాన్ని మేకర్స్ ట్విట్టర్ వేదికగా అఫీషియల్‌గా తెలియచేస్తూ ఒక ఫోటోను కూడా షేర్ చేశారు. హీరో అఖిల్ , దర్శకుడు సురేంద్ర రెడ్డితో పాటు ఇతర టెక్నీషియన్స్ ఆ ఫోటోలో కనిపిస్తున్నారు. ఏకే ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై అనిల్ సుంకర 'ఏజెంట్' చిత్రంలో మాలీవుడ్ మెగాస్టార్ మమ్ముట్టి విలన్‌గా నటిస్తున్నారు. 'యాత్ర' తర్వాత ఆయన నటిస్తున్న డైరెక్ట్ తెలుగు చిత్రం ఇదే కావడం విశేషం. దేశానికి ముప్పు వాటిల్లే కుట్రలు జరుగుతుండడంతో సీక్రెట్ మిషన్ ను టేకప్ చేస్తాడు కథానాయకుడు. అందులో భాగంగా ఓ రిటైర్డ్ మిలటరీ మేజర్‌తో తలపడాల్సి వస్తుంది. చివరికి తన దేశాన్ని రక్షించుకోడానికి హీరో ఎలాంటి సాహసం చేశాడు అన్నదే ఈ సినిమా కథాంశం. మిలటరీ మేజర్‌గా మమ్ముట్టి నటిస్తున్నారు. సాక్షివైద్య కథానాయికగా నటిస్తున్న ఈ సినిమాకి హిపాప్ తమిళ సంగీతం అందిస్తున్నాడు. మరి ఈ సినిమాతో అఖిల్ ఏ స్థాయిలో పేరు తెచ్చుకుంటాడో చూడాలి.

## ఆధునిక టెక్నాలజీతో విక్రమ్ నిర్మాణం

యూనివర్సల్ హీరో కమల్ హాసన్, విలక్షణ నటులు విజయ్ సేతుపతి, ఫాహద్ ఫాజిల్ కలిసి నటించిన చిత్రం 'విక్రమ్'. లోకేష్ కనగరాజు దర్శకత్వం వహించిన ఈ సినిమాలో సూర్య కీలక పాత్రలో నటిస్తున్న విషయం తెలిసిందే. కమల్ సొంత నిర్మాణ సంస్థ రాజ్ కమల్ ఇంటర్నేషనల్ ఫిలింస్ పతాకంపై భారీ బడ్జెట్‌తో తెరకెక్కిన ఈ మూవీ ప్రపంచవ్యాప్తంగా జూన్ 3న ప్రేక్షకుల ముందుకు తీసుకువస్తున్నారు. నలుగురు సూపర్ టాలెంటెడ్ హీరోలు కలిసి నటించిన ఈ మూవీపై అంచనాలు మామూలుగా లేవు. అయితే నటనతో ఆకట్టుకోవడమే కాదు టెక్నాలజీని అందిపుచ్చుకోవడంలో ముందుంటారు కమల్ హాసన్. ఈ సినిమాను మెటావర్స్ వెర్షన్‌లో రిలీజ్ చేయనున్నట్లు ఆయన ప్రకటించారు. ఎన్ఎఫ్‌టీలు, వర్చువల్ రియాలిటీ టెక్నాలజీ మెటావర్స్ ద్వారా ఆడియెన్స్ ముందుకు వస్తున్న తొలి చిత్రంగా 'విక్రమ్' నిలవనుంది. దీనికి సంబంధించిన వివరాలను 'విస్టావర్స్' వెబ్‌సైట్‌లో అందుబాటులోకి తేనున్నారు. ఈ వెబ్‌సైట్‌లో పోస్టర్లు, ఇంటర్వ్యూలు, లేటేస్ట్ అప్‌డేట్స్ తదితర అన్ని విషయాలు ఉంటాయి.





## పుష్ప-2 కోసం భారీ ప్లాన్స్

స్టైలీష్ స్టార్ అల్లు అర్జున్, క్రియేటివ్ డైరెక్టర్ సుకుమార్ కాంబినేషన్‌లో వచ్చిన పుష్ప మూవీ క్రియేట్ చేసిన సెన్సేషన్ అంతా ఇంతా కాదు. పాన్ వరల్డ్ స్థాయిలో పుష్పరాజ్ వైరల్ అయ్యాడు. డైలాగ్స్, సాంగ్స్, స్టెప్పులు..ఇలా ప్రతీదీ ట్రెండ్ అయ్యాయి. ముఖ్యంగా 'తగ్గేదేలే'అనే డైలాగ్ గురించి ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. ఈ ఒక్క డైలాగ్‌కు ప్రపంచంలోని సినీ ప్రియులంతా ఫిదా అయ్యారు. ఈ రేంజ్ క్రేజ్ ఉన్న పుష్పకు పార్ట్ 2 అంటే ఎలా ఉండాలి? అందుకే లేట్ గా వచ్చిన లేటేస్ట్‌గా వస్తామంటున్నాడు సుకుమార్. పుష్పతో ట్రెండ్ చేసిన సుక్కు. పార్ట్ 2కు మాత్రం పాన్ ఇండియా ట్రెండ్‌ని ఫాలో కావాలనుకుంటున్నాడట. గతంలో వచ్చిన బాహుబలి, రీసెంట్‌గా విడుదలైన కేజీయఫ్-2లో హీరో వర్సెస్ విలన్ వార్‌ని నెక్స్ట్ లెవల్‌లో చూపించారు. అందుకే ఈ రెండు సీక్వెల్ చిత్రాలు సూపర్ హిట్ అయ్యాయి. ఇప్పుడు ఇదే ట్రెండ్ ను పుష్ప రాజ్ కూడా ఫాలో అవుతాడని చెబుతున్నాడు సుకుమార్. సెకండ్ పార్ట్ లో అల్లు అర్జున్ ,ఫాహద్ ఫాజిల్ మధ్య గేమ్ సీన్ సినిమాకు హైలైట్ గా నిలువనుందని క్లారిటీ ఇచ్చేశాడు. ఫస్ట్ పార్ట్ కంటే సెకండ్ పార్ట్ ఇంకా ఇంప్రెసివ్ గా ఉంటుందనీ, కొన్ని సీన్స్ అయితే అబ్బురపరుస్తాయని రీసెంట్ గా ఓ ఇంటర్వ్యూలో చెప్పుకొచ్చాడు. జులై నుంచి సెకండ్ పార్ట్ షూట్ ప్రారంభం కానుంది. దాదాపు రూ. 400 కోట్ల బ్జడెట్ తో ఈ చిత్రం రూపొందుతుంది. మారేడుమిల్లి అడవుల్లోనే ఎక్కువ భాగం షూటింగ్ షెడ్యూల్స్ ఫిక్స్ చేసాడు సుకుమార్. జనవరితో షూటింగ్ కంప్లీట్ చేసి, మరో నాలుగు నెలలు పోస్ట్ ప్రోడకన్ కు టైమ్ ఇచ్చి, వచ్చే వేసవి లో పుష్పరాజ్ గ్రాండ్ రీఎంట్రీకి ప్లాన్ చేస్తున్నారు.

## ఇంద్రగంటి మోహనకృష్ణతో లైగర్ దేవరకొండ సినిమా

వరుస చిత్రాలతో బిజీగా ఉన్న విజయ్ దేవరకొండ తాజాగా మరో టాలెంటెడ్ డైరెక్టర్‌కు గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్టుగా ఓ వార్త సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతోంది. ఆయనే ఇంద్రగంటి మోహనకృష్ణ . లైగర్ సినిమాతో మొదటి సారి పాన్ ఇండియా మార్కెట్ లోకి అడుగు పెట్టబోతున్న విజయ్ దేవరకొండ ఈ సినిమాతో సాలీడ్ హిట్ అందుకుకొని పాన్ ఇండియన్ స్టార్‌గా క్రేజ్ తెచ్చుకోవాలని ఆరాటపడుతున్నాడు. పూరి జగన్నాథ్ దర్శకత్వంలో రూపొందుతున్న లైగర్ సినిమాను ఈ ఏడాది ఆగస్టు 25న ప్రపంచ వ్యాప్తంగా రిలీజ్ చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఇక ఈ సినిమాను పూర్తి చేసిన విజయ్, పూరి డైరెక్షన్‌లోనే మరో పాన్ ఇండియా సినిమా జనగణమనలో నటిస్తున్నాడు. ఈ సినిమా షూటింగ్ కూడా శరవేగంగా జరుగుతోంది. మరోవైపు శివ నిర్వాణ దర్శకత్వంలో ఖుషి అనే రొమాంటిక్ ఎంటర్‌టైనర్‌ను చేస్తున్నాడు. సమంత (÷ూజీపజీనిబిరజీ) హీరోయిన్‌గా నటిస్తున్న ఈ సినిమా ఫస్ట్ షెడ్యూల్ ఇటీవలే కశ్మీర్‌లో పూర్తైంది. త్వరలో వైజాగ్ పరిసర ప్రాంతాలలో సెకండ్ షెడ్యూల్‌ను మొదలుపెట్టనున్నారు. లైగర్, ఖుషి బ్యాక్ టు బ్యాక్ రిలీజ్ అయ్యేలా విజయ్ ఎ÷-లాన్ చేసుకుంటున్నాడు.ఈ క్రమంలోనే మోహన్ క్రిష్ణ ఇంద్రగంటి దర్శకత్వంలోనూ ఓ సినిమా చేసేందుకు రౌడీ స్టార్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్టు సమాచారం. వీరి కాంబోలో కూడా పాన్ ఇండియా సినిమానే ఎ÷-లాన్ చేస్తున్నారట. త్వరలో ఈ ప్రాజెక్ట్‌కు సంబంధించిన అఫీషియల్ కన్‌ఫర్మేషన్ రానుందని తెలుస్తోంది. ప్రస్తుతం ఇంద్రగంటి దర్శకత్వంలో సుధీర్ బాబు, కృతిశెట్టి జంటగా ఆ అమ్మాయి గురించి మీకు చెప్పాలి అనే చిత్రం రూపొందుతోంది. దీని తర్వాత విజయ్ సినిమా ఉండే అవకాశాలున్నాయి.



## ఓటిటిలోనూ ఆర్ఆర్ఆర్ హవా

బాహుబలి సినిమా తర్వాత దర్శక ధీరుడు ఎస్ ఎస్ రాజమౌళి సృష్టించిన మరో అద్భుతం ఆర్ఆర్ఆర్... ఎంతటి ఘన విజయాన్ని నమోదు చేసిందో, ఎన్ని రికార్డులను బద్దలు కొట్టిందో మర్చిపోకముందే తాజాగా ఈ మూవీ మరో అరుదైన రికార్డును బ్రేక్ చేసింది. బాక్సాఫీస్ వద్ద కలెక్షన్ల సునామీ సృష్టించిన ఈ సినిమా... ఇటీవలే ఓటీటీలోనూ విడుదలైంది. కాగా ఎవ్రీవన్స్ వాచింగ్ సెలక్షన్ లిస్ట్ లో ఈ మూవీ ట్రెండింగ్ లో నిలిచిందని నెట్ ఫ్లిక్స్ తన ట్విట్టర్ అకౌంట్లో పేర్కొంది. ఇకపోతే సీతారామరాజు- కొమురం భీమ్ పాత్రల్లో నటించిన మెగా పవర్ స్టార్ రామ్ చరణ్, యంగ్ టైగర్ ఎన్టీఆర్ ప్రేక్షకులను ఆకట్టుకున్న విషయం తెలిసిందే. మార్చి 25న ప్రపంచ వ్యాప్తంగా రిలీజైన ఈ మూవీకి కనీవినీ ఎరుగని రీతిలో కలెక్షన్ల పరంగా కూడా విజయ దుందుభి మోగించింది. కాగా ఇప్పటికే జీ5, నెట్ ఫ్లిక్స్ ఓటీటీల్లో విడుదలై సందడి చేస్తోంది.




Edited, Printed, Published & owned by **GOSUKONDA PRUDHVIRAJU**, Published From, H.No. 6-17, VI:PALIVELA, MANDAL:MUNUGODE, DIST: NALGONDA - 508244, TELANGANA,
Printed at **GPR PUBLICATIONS**. H.NO: 6-17, VI:PALIVELA, MANDAL:MUNUGODE, DIST: NALGONDA - 508244, Editor: **GOSUKONDA PRUDHVIRAJU**,
TITLE CODE.TELTEL02057, Cell:8464816456 Email: aksharavelugudaily@gmail.com, Website: www.aksharavelugu.com